రంజాన్ వేళలు
ఇఫ్తార్ : 6:20 (గురువారం సాయంత్రం)
సహార్ : 4:41 (శుక్రవారం ఉదయం)

మృత్యువుతో పోరాడి ఓడిన శిశువు 7



'ఆంధ్రజ్యోతి' లక్కీడ్రా నేడే!

ఆంధ్రజ్యోతి యూనిట్ కార్యాలయంలో విజేతల ఎంపిక
3 ప్రధాన బహుమతులతోపాటు వంద కన్సొలేషన్ గిఫ్టులు
మోటార్ బైక్, రిఫ్రిజిరేటర్, టీవీ తదితర బహుమతులు

సమయం : గురువారం సాయంత్రం 4 గంటలకు
వేదిక : పాలచర్లలోని ఆంధ్రజ్యోతి ప్రధాన కార్యాలయం



పాఠకులు ఎప్పుడెప్పుడా అని ఆత్రుతగా ఎదురుచూస్తున్న 'ఆంధ్రజ్యోతి లక్కీడ్రా' గురువారం జరగనుంది. రాజమహేంద్రవరం సమీపంలోని దివాన్‌చెరువు-వెలుగుబంద రోడ్‌లోని పాలచర్లలో ఆంధ్రజ్యోతి యూనిట్ కార్యాలయం వేదికగా 'కార్ అండ్ బైక్ రేస్'లో అదృష్ట పాఠకులు ఎవరన్నది సాయంత్రం 4 గంటలకు తేలనుంది. పాఠకుల నుంచి వచ్చిన వేలాది కూపన్లలో విజేతలను ఎంపిక చేయనున్నారు. ప్రథమ బహుమతి కింద మోటార్ బైక్, రెండో బహుమతి రిఫ్రిజిరేటర్, మూడో బహుమతి టీవీని విజేతలకు అందజేయనున్నారు. అలాగే మరో 100 కన్సొలేషన్ బహుమతుల కింద ఒక్కొక్కరికి రూ.2వేలు విలువచేసే గృహోపకరణాలను అందజేయనున్నారు. 'ఆంధ్రజ్యోతి' 22వ వార్షికోత్సవం సందర్భంగా పాఠకులకు రూ.కోటి విలువైన బహుమతులను అందజేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే.



పుష్కరాలపై ఫోకస్

- పుష్కరాలకు ఇద్దరు ప్రత్యేక అధికారులు
- హేవలాక్ బ్రిడ్జి పర్యాటకంగా అభివృద్ధికి రైల్వేకి రూ.12.50 కోట్లు చెల్లించాం
- తలసరి ఆదాయం పెరుగుదలపై దృష్టి పెట్టండి
- సీఎం చంద్రబాబు స్పష్టీకరణ
- జిల్లా భవిష్యత్ కార్యాచరణపై ప్రజంటేషన్ ఇచ్చిన కలెక్టర్





సమావేశంలో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు.. సమీక్షలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం, మార్చి 26(ఆంధ్రజ్యోతి): రానున్న గోదావరి పుష్కరాలకు ఇప్పటినుంచే తగిన ముందస్తు ఏర్పాట్ల పర్యవేక్షణకు ఇద్దరు ఐఏఎస్ అధికారులు వీరపాండ్యన్, వి.విజయరామరాజులను ప్రత్యేక అధికారులుగా నియమిస్తున్నామని సీఎం చంద్రబాబునాయుడు కలెక్టర్ల సమావేశంలో పేర్కొన్నారు. రాజమహేంద్రవరంలో ఐదు వేల హోటల్ రూములు అందుబాటులో ఉండాల్సిన అవసరం ఉందన్నారు. తగిన భూమిని గుర్తించి అందుబాటులో ఉంచుకుంటే హోటళ్ల నిర్మాణానికి ముందుకు వచ్చేవారితో మాట్లాతామని చంద్రబాబు చెప్పారు. అమరావతిలో రెండు రోజులపాటు జరిగి బుధవారం ముగిసిన కలెక్టర్ల సమీక్షలో ఆయన మాట్లాడారు. రాజమహేంద్రవరంలో హేవలాక్ బ్రిడ్జి, పిచ్చుకలంక, కడియం నర్సరీలు, పోలవరాన్ని కలుపుతూ ఒక పర్యాటక సర్క్యూట్ అభివృద్ధి చేయాలని ఆదేశించారు. హేవలాక్ బ్రిడ్జిని పర్యాటకంగా అభివృద్ధి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే రైల్వే శాఖకు రూ.12.50 కోట్లు చెల్లించిందని సీఎం తెలిపారు. ఆ దిశగా కేంద్రం నుంచి నిధులు రాబట్టడానికి కృషి చేయాలని ఆదేశించారు. ఒకప్పుడు దేశానికే అన్నపూర్ణగా పేరుగాంచిన గోదావరి జిల్లాల్లో రానురాను తలసరి ఆదాయం తగ్గుతోందన్నారు. దీనిపై కలెక్టర్లు ప్రత్యేకంగా దృష్టిసారించాలని సూచించారు. వరిగడ్డితో బయో ఇంధనం తయారీ యూనిట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు.

మా కార్యాచరణ ఇదీ : కలెక్టర్

కలెక్టర్లతో సీఎం చంద్రబాబు సమావేశంలో భాగంగా తూర్పుగోదావరిలో కార్యాచరణ ప్రణాళికను కలెక్టర్ పి.ప్రశాంతి వివరించారు. జిల్లాలో 77820 హెక్టార్లలో పంట లక్ష్యం కాగా 4970 హెక్టార్లలో ఉద్యాన పంటను ప్రోత్సహించనున్నామన్నారు. జిల్లాలో 12-15% వరకూ పాలు, మాంసం, గుడ్లు వృద్ధి రేటు, మత్స్యసంపదను 2వేల హెక్టార్లలో అదనంగా పెంచడాన్ని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. పారిశ్రామికవృద్ధిలో భాగంగా ప్రతి నియోజకవర్గంలోనూ ఎంఎస్ఎంఈ పార్కులను, నానో ఎంఎస్ఎంఈ పార్కులను ఏర్పాటు చేస్తామన్నారు. కల్వచర్లలో జియో బయో ఫ్యూయల్ ఇండస్ట్రీని ప్రారంభిస్తానమ్నారు. పీఎం సూర్యఘర్ పథకంలో భాగంగా 7500 కిలోవాట్ల సామర్థ్యంతో 2500 ఇళ్లపై రూఫ్‌టాప్ ఏర్పాటు చేయనున్నామని ఆమె వివరించారు. 160 కిలోమీటర్లమేర సీసీ, బీటీ రోడ్లను రూ.85 కోట్ల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో నిర్మిస్తామని చెప్పారు. నిడదవోలులో రూ.184.74 కోట్లతో ఆర్వోబీ, రాజానగరం నుంచి సామర్లకోట వరకూ రూ.298కోట్లతో ఏడీబీ రోడ్డును అభివృద్ధి చేస్తున్నామన్నారు. జిల్లాలో 10 ఆర్వోబీలను నిర్మించనున్నామని పేర్కొన్నారు. 10 వేల 784 ఇళ్ల నిర్మాణాన్ని లక్ష్యంగా నిర్ణయించుకున్నామని చెప్పారు. అక్టోబరులో అంతర్జాతీయ పుష్ప ప్రదర్శనను కడియంలో నిర్వహిస్తామన్నారు. బొమ్మూరు వద్ద ఎస్‌సీడీసీ పథకంలో ప్రపంచంలోనే పెద్దదైన గ్రెయిన్ స్టోరేజీ అండ్ ప్రాసెసింగ్ యూనిట్‌ని ప్రతిపాదిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాల, ప్రభుత్వాస్పత్రి వద్ద 4జీ సాచురేషన్ ప్రాజెక్టులను నెలకొల్పుతామని, కొవ్వూరు ప్రభుత్వాస్పత్రిని 50 నుంచి 150 పడకల ఆస్పత్రిగా అభివృద్ధి చేయనున్నామని తదితర అంశాలను ప్రజంటేషన్ ద్వారా కలెక్టర్ ప్రశాంతి వివరించారు.

ఇన్‌పుట్ సబ్సిడీ విడుదలకు లైన్ క్లియర్

సీఎంకి కృతజ్ఞతలు తెలిపిన దుర్గేష్



నిడదవోలు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): నిడదవోలులో ఎర్రకాలువ ముంపు వల్ల నష్టపోయిన రైతాంగానికి ఇన్‌పుట్ సబ్సిడీ విడుదలకు లైన్‌క్లియర్ అయినట్టు రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖా మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. బుధవారం ఈమేరకు ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. వెలగపూడి సెక్రటేరియట్‌లో బుధవారం రెండో రోజు జరుగుతున్న కలెక్టర్ల సదస్సులో ఎర్రకాలువ ముంపు బాధితుల ఇన్‌పుట్ సబ్సిడీ విడుదలకు సంబంధించిన అంశాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకువెళ్లినట్టు మంత్రి దుర్గేష్ తెలిపారు. దీనిపై తక్షణం స్పందించిన చంద్రబాబునాయుడు ఆర్థిక శాఖలో సంబంధిత అధికార్లతో మాట్లాడి ఇన్‌పుట్ సబ్సిడీ సమస్యకు చెక్ పెట్టారన్నారు. 2024 జూలై నెలలో సంభవించిన భారీ వర్షాలకు నష్టపోయిన రైతాంగానికి ఇప్పటికే ఇన్‌పుట్ సబ్సిడిపై ప్రకటన చేశామని, ఈ సమస్యకు పరిష్కారం చూపిన చంద్రబాబుకి కృతజ్ఞతలు తెలిపారు.

నేడు బిక్కవోలు ఎంపీపీ సహా 11 ఉపసర్పంచ్ పదవులకు ఎన్నికలు

- ఏర్పాట్లు పూర్తి
- ఉండ్రాజవరం ఉపసర్పంచ్ ఎన్నిక వాయిదా

రాజమహేంద్రవరం మార్చి26(ఆంధ్రజ్యోతి):జిల్లాలో పలు ఉపసర్పంచ్‌లు, బిక్కవోలు ఎంపీపీ ఎన్నిక గురువారం జరుగనున్నది. దీనికి సంబంధించి ఎన్నికల అధికారులు ఏర్పాట్లు సిద్ధం చేశారు. తెలుగుదేశం కూటమి ఎక్కువ స్థానాలు దక్కించుకునే ప్రయత్నం చేస్తోంది. కూటమికే అనుకూల పరిస్థితులు కనిపిస్తున్నాయి. జిల్లాలో మొత్తం 12 ఉపసర్పంచ్ పదవులకు, బిక్కవోలు ఎంపీపీ పదవికి, మరో రెండు కోఆప్షన్ సభ్యులకు ఎన్నిక జరగాల్సి ఉంది. ఉండ్రాజవరం గ్రామంలో ఇటీవల ఒక వార్డు మెంబరు చనిపోవడంతో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు గురువారం జరగాల్సిన ఉండ్రాజవరం ఎన్నిక వాయిదా పడింది. ఇక బిక్కవోలు ఎంపీపీ ఎన్నికకు రంగం సిద్ధమైంది. గతంలో వైసీపీ ఎంపీపీ ఇక్కడ రాజీనామా చేశారు. మొత్తం 20 మంది వైసీపీ ఎంపీటీసీలు ఉండగా, అందులో ఆరుగురు ఇప్పటికే టీడీపీలోకి చేరారు. మరో ఆరుగురు చేరడానికి సిద్ధంగా ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. ఈనేపథ్యంలో ఈ ఎంపీపీ పదవి కూటమికి దక్కే అవకాశం కనిపిస్తోంది. కానీ ఇక్కడ వైసీపీ ఒక అభ్యర్థిని ప్రకటించింది. కూటమి తరపున తొస్సిపూడి ఎంపీటీసీ సుమ పేరు పరిశీలనలో ఉన్నట్టు సమాచారం. ఇక గోకవరం మండలంలో మల్లేశ్వరం, కొవ్వూరు మండలంలో పెనకనమెట్ట, రాజానగరం మండలంలో పాతతుంగపాడు, గోపాలపురం మండలంలో కోవ్వూరుపాడు, వెంకటాయపాలెం, తాళ్లపూడి మండలంలో తాడిపూడి, అనపర్తిలో మండలంలో లక్ష్మీనరసాపురం, రంగంపేట మండలంలో మర్రిపూడి, కడియం మండలంలో మురమండ, సీతానగరం మండలంలో మునికూడలి ఉపసర్పంచ్ పదవులకు ఎన్నికలు జరగనున్నాయి. వాటితోపాటు పెరవలి, రంగంపేట మండల కోఆప్షన్ సభ్యుల ఎన్నికలు జరుగనున్నాయి. వీటిలో చాలావరకు కూటమికి దక్కే అవకాశం ఉంది. కొన్ని ఏకగ్రీవం అయ్యే చాన్స్ ఉంది.

ఉద్రిక్తత.. ఉత్కంఠ!





ఆందోళనకారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, ఎస్పీ నరసింహ కిషోర్



రాజమహేంద్రవరం ప్రభుత్వ బోధనాసుపత్రి మార్చురీ నుంచి మృతదేహాన్ని తరలిస్తున్న దృశ్యం

ప్రభుత్వ బోధనాసుపత్రి వద్ద నిరసనలు



ప్రభుత్వ బోధనాసుపత్రి వద్ద ఆందోళనకారులను చెదరగొడుతున్న పోలీసులు

- పాస్టర్ ప్రవీణ్ మృతిపై ఆందోళన
- రోడ్డు ప్రమాదం కాదు.. హత్యేనంటూ నిరసనలు
- రాజమహేంద్రి ప్రభుత్వాసుపత్రి వద్ద ఉద్రిక్తత
- భారీ సంఖ్యలో తరలి వచ్చిన అనుచరులు
- ఆస్పత్రి వద్ద కేఏ పాల్, మాజీ ఎంపీ హర్షకుమార్
- భారీ సంఖ్యలో మోహరించిన పోలీసులు
- ప్రవీణ్ మృతదేహం హైదరాబాద్ తరలింపు
- దర్యాప్తు వేగవంతం : ఎస్పీ నరసింహ కిశోర్
- అనుమానాస్పద మృతిగా కేసు నమోదు

- మెయిన్/జిల్లాలో..



గొడౌన్‌కు చేరిన పుస్తకాలు

పుస్తకాల బరువు తగ్గింది!

- పుస్తకాలు వచ్చేస్తున్నాయి
- ఒకే పుస్తకంలో తెలుగు-ఇంగ్లీషు..మ్యాథ్స్ పాఠాలు
- రెండు సెమ్‌లు.. రెండు దఫాల పుస్తకాల పంపిణీ
- జిల్లాకు సుమారు 35లక్షల పాఠ్యపుస్తకాలు అవసరం
- ఇప్పటికే 4,83, 909 రాక
- ప్రభుత్వ పాఠ్యపుస్తకాల జిల్లా మేనేజర్ సురేష్



(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

తెలుగుదేశం కూటమి ప్రభుత్వం విద్యార్థుల పుస్తకాల మోత బరువు తగ్గింది. కొన్ని పుస్తకాలను కలిపి ఒకే పుస్తకంగా ముద్రించారు. ఈ కూటమి ఈ పుస్తకంలోని పాఠాలను రెండుగా విభజించి.. రెండు పుస్తకాలుగా ముద్రించారు. సెమిస్టర్ విధానంలో పరీక్షలు ఉంటున్న సంగతి తెలిసిందే. గతంలో విద్యా సంవత్సరంలో మూడు సెమ్‌లు ఉండాలి. వాటిని రెండుకు కుదించారు. ఈ నేపథ్యంలో పాఠ్య పుస్తకాలను మొదటి సెమ్‌కు పాఠశాలలు తెరవక ముందే పంపిణీ చేస్తారు. మరో ఆరు నెలలకు మొదలైతే రెండో సెమ్‌కు కొంత ముందుగానే పుస్తకాలు పంపిణీ చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రస్తుతం మొదటి సెమ్ పుస్తకాలు వచ్చేశాయి. జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు సుమారు 35 లక్షల వరకూ పుస్తకాలు అవసరం ఉంది. ఇప్పటికే 4,83,909 పాఠ్య పుస్తకాలు వచ్చా యని ప్రభుత్వ పాఠ్యపుస్తకాల జిల్లా మేనేజర్ పి.సురేష్ తెలిపారు. మొదటి సెమ్‌కు అవసరమైన పుస్తకాలు వచ్చేనెలలో పూర్తిగా వస్తాయనిచెప్పారు.

మూడు పుస్తకాలు.. ఇక ఒక పుస్తకమే

ఒకటవ తరగతి నుంచి 2వ తరగతి వరకూ తెలుగు, ఇంగ్లీషు, మాథ్స్ పుస్తకాలు ఇక వేర్వేరుగా ఉండవు. ఈ మూడింటిని ఒకే పుస్తకంగా తీసుకొచ్చారు. మొదటి సెమ్‌కు అవసరమైన పుస్తకాలు, ముందుగానే, రెండో సెమ్‌కు అవసరమైన పుస్తకాలను వేర్వేరుగా ముద్రించడంవల్ల పుస్తకాల సైజ్ కూడా తగ్గింది. దీంతో పిల్లలకు బరువు తగ్గింది. ఇక 3వ తరగతి నుంచి 5వ తరగతి వరకూ తెలుగు, ఇంగ్లీషు పుస్తకాలను ఒకటిగా కలిపేశారు. మాథ్స్ ఎన్విరాన్‌మెంట్ల వంటి మరో పుస్తకంగానూ ముద్రిస్తున్నారు. ఇలా 1వ తరగతి నుంచి 9వ తరగతి వరకూ పుస్తకాలను కలిపి ముద్రిస్తున్నారు. ఈ పరిస్థితి వల్ల పుస్తకాల సంఖ్య కూడా బాగా తగ్గడం గమనార్హం. గతంలో మొత్తం 1నుంచి పదవతరగతి వరకూ విద్యార్థికి 112 పుస్తకాలు ఉండేవి. ఇవాళ వాటి సంఖ్య 80కు తగ్గింది. ప్రస్తుతం సెమ్-1కు 46, సెమ్-2కు 34 పుస్తకాలు మాత్రమే అమలు చేస్తున్నారు. గతంలో 1, 2వ తరగతి ఒక్కింటికి 8 పుస్తకాలు వంతున ఉండేవి. ప్రస్తుతం అవి నాలుగు మాత్రమే. మూడు నుంచి 5వ తరగతి వరకూ 12వంతున ఉండేవి. ప్రస్తుతం 8 మాత్రమే ఉన్నాయి. ఆరు, ఏడు తరగతులకు 9 వంతున ఉండేవి ప్రస్తుతం 8 మాత్రమే. 8వ తరగతికి 13 పుస్తకాలు ఉండేవి. ఇవాళ వాటి సంఖ్య 8 మాత్రమే. 9వ తరగతికి 16 ఉండేవి. వాటి సంఖ్య ఇవాళ 9 మాత్రమే. పదో తరగతికి మాత్రం గతంలో 13 ఉండేవి. ప్రస్తుతం కూడా 13గానే ఉన్నాయి.



ప్రభుత్వ పాఠ్యపుస్తకాల జిల్లా మేనేజర్ సురేష్

మద్యం మత్తులోనే అంబేడ్కర్ విగ్రహానికి చెప్పుల దండ వేశాడు

- సీఐ రాంబాబు వెల్లడి

నల్లజర్ల, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): దూబచర్ల గాంధీకాలనీలో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి, ముసుళ్లకుంటలో ఎన్టీఆర్ విగ్రహాలకు చెప్పుల దండ వేసిన నిందితుడు పుల్లలపాడుకు చెందిన వైసీపీ నేత బుడుపుల బాబ్జీ మద్యం మత్తులో ఉండడం వల్లే వేశాడని సీఐ రాంబాబు వెల్లడించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైసీపీలో తొందరగా గుర్తింపు రావాలనే ఉద్దేశంతో ఈనెల 21వ తేదీ అర్ధరాత్రి ఫుల్‌గా మద్యం సేవించి రెండు విగ్రహాలకు చెప్పుల దండ వేసినట్టు నిందితుడు తెలిపినట్టు సీఐ పేర్కొన్నారు. ఇప్పటికే నిందితుడిపై 2024 మేలో హత్యాయత్నం కేసు, జూన్‌లో ఆయుధంతో దాడి చేసిన కేసు నమోదు అయ్యి ప్రస్తుతం బెయిల్‌పై ఉన్నట్టు తెలిపారు.

శాసనసభ కమిటీ ఆన్ ఎథిక్స్ సభ్యుడిగా ఎమ్మెల్యే ముప్పిడి

కొవ్వూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర శాసనసభ కమిటీ ఆన్ ఎథిక్స్ కమిటీ సభ్యుడిగా కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు నియమితులయ్యారు. బుధవారం వెలగపూడిలో జరిగిన శాసనసభ కమిటీల ప్రాథమిక సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెంకటేశ్వరరావు మాట్లాడుతూ శాసనసభ కమిటీల్లో ఒకటైన ఆన్ ఎథిక్స్‌లో సభ్యుడిగా నియమించడంపై స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం కొణిదల పవన్‌కల్యాణ్, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

టీడీపీ కార్యకర్త కుటుంబానికి ప్రమాద బీమా చెక్కు

ఉండ్రాజవరం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): వడ్లూరుకి చెందిన టీడీపీ కార్యకర్త రాపాక రమేష్ కుటుంబానికి పార్టీ తరఫున ప్రమాద బీమా రూ.5 లక్షలు మంజూరైనట్టు మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బూరుగుపల్లి శేషారావు తెలిపారు. ఈ మేరకు చెక్కును బుధవారం రమేష్ కుటుంబ సభ్యులకు అందజేశారు. పార్టీ సభ్యత్వం ద్వారా వచ్చిన బీమా వర్తించిందని శేషారావు చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు సింహాద్రి రామకృష్ణ, వడ్లూరు గ్రామ టీడీపీ అధ్యక్షుడు పి.వెంకటేశ్వరరాజు, బూత్ ఇన్‌చార్జి వి. రెడ్డి, ఇతర నాయకులు పాల్గొన్నారు.



చెక్కును అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే శేషారావు



ఆహా..రం!



ఆరోగ్యమే మహాభాగ్యం.. ప్రస్తుతం చాలా మంది నోట ఈ మాట వింటున్నాం.. ఆరోగ్యం వస్తుందంటే ఖర్చుకు అసలు వెనుకాడడంలేదు.. ఎంతయినా ఖర్చు పెడుతున్నారు.. ఆహారం తింటున్నారు.. దానికి డ్రైఫ్రూట్స్ వినియోగమే కారణం.. కొవిడ్ తర్వాత అమ్మకాలు అమాంతం పెరిగిపోయాయి.. ప్రతి నెలా బడ్జెట్ లో డ్రైఫ్రూట్స్ చేరిపోయాయి.. అంతే కాదు.. ఆన్‌లైన్‌లో అమ్మకాలు వచ్చేశాయి.. దానికి తగినట్టు దుకాణాలు వెలిశాయి.. ప్రస్తుతం రంజాన్ మాసం కావడంతో ముస్లింలు ఎక్కువగా వినియోగిస్తారు.. అసలు డ్రైఫ్రూట్స్ తింటే ఉపయోగం ఏంటి.. అందులో ఉన్న రహస్యమేంటి అనేదానిపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం..

ధరలిలా..

ఖర్జూరం కిలో రూ.90 నుంచి రూ.3 వేల వరకూ ఉంటాయి. నాణ్యత, రుచిని బట్టి రేటు ఫిక్స్ చేస్తారు. బాదం, పిస్తా వంటి ధరలు కిలో రూ.1,000 నుంచి రూ.1600 పైనే ఉంటాయి. అరబ్ దేశాల్లోను నాణ్యత గ్రేడింగ్ ఉంటుంది. నెంబర్-1 క్వాలిటీ గ్రేడ్-1 ధర ఎక్కువగా ఉంటే నెంబర్ 2, 3 గ్రేడింగ్ ధర తక్కువగా ఉంటుంది. దీన్ని బట్టి రేటు ఉంటుంది. అంజీర, పిస్తా, బాదం, అక్రూట్ తదితర రకాలు కేజీ రూ.వెయ్యిపైనేఉంటాయి.



జీడిపప్పు.. ఎక్కడెక్కడి నుంచంటే..

జీడిపప్పును ఇంతకు ముందు శ్రీకాకుళం జిల్లా పలాస నుంచి దిగుమతి చేసుకునేవారు. ప్రస్తుతం అక్కడి రోస్టెడ్ జీడిపప్పుపై బ్యాన్ విధించడంతో అక్కడి నుంచి బాయిల్డ్ జీడిపప్పును మాత్రమే దిగుమతి చేసుకుంటున్నారు. కోనసీమ జిల్లాలోని మలికిపురం మండలం మోరి నుంచి, ప్రకాశం జిల్లా వేటపాలెం నుంచి జీడిపప్పును తెచ్చి విక్రయిస్తున్నట్టు డ్రైఫ్రూట్స్ వ్యాపారులు చెబుతున్నారు. 320 కౌంట్ ధర (కిలోకి 320 పిక్కలు తూగుతాయి) ధర రూ.900-1100 మధ్య ఉంటుంది. 220 కౌంట్ ధర రూ.1100-1300 మధ్య ఉంటుంది. 180 కౌంట్ ధర రూ.1500-1800 వరకు ఉంటుంది.

- పెరిగిన డ్రైఫ్రూట్స్ వినియోగం
- పట్టణాలు.. పల్లెల్లోనూ దుకాణాలు
- రంజాన్‌లో ముస్లింలకు అదే ఆహారం
- ఎక్కడెక్కడి నుంచో దిగుమతులు
- కొవిడ్ తరువాత నుంచి ప్రజల్లో చైతన్యం
- అంతగా అమ్మకాల్లేవంటున్న వ్యాపారులు

ఖర్జూరంతో ఆరోగ్యం

ఖర్జూరాలు బరువు పెరగడం, కండరాల అభివృద్ధి,గాయాల నుంచి కోలుకోవడం, రక్తపోటును తగ్గించడం, జీర్ణక్రియను క్రమబద్ధీకరించడం, కంటి ఆరోగ్యం మొదలైన వాటిలో సహాయ పడతాయి. కాల్షియం, కాపర్, పోలేట్, ఐరన్, మెగ్నీషియం, మాంగనీస్, నియాసిన్, పాస్పరస్, పొటాషియం, రిబోఫ్లావిన్, సల్ఫర్, థయామిన్, జింక్, విటమిన్-ఏ లభిస్తాయి. ఖర్జూరంలో శరీరానికి మేలు చేసే వివిధ ఆరోగ్య ప్రయోజనాలు పుష్కలంగా ఉన్నాయి. ఖర్జూరాన్ని రోజూ తీసుకోవడం వల్ల ఆరోగ్యం మెరుగుపడడమే కాకుండా వ్యాధుల బారిన పడకుండా కాపాడుతుంది.

ఎన్నెన్నో రకాలు..

ఖర్జూరంలో చాలా రకాలు ఉన్నాయి. డెగ్లట్ నూర్, మెడ్జూల్, ఖాద్రావి, హనీ, బ్లాక్ డేట్, గోల్డెన్ ప్రిన్సెస్,ఒమానీ, కల్మీ, ఖుద్రీ, జహీదీ, హలవీ ఇలా అనేక రకాలు ఉన్నాయి. వాటిలో ప్రధానంగా అమెరీ డేట్స్, అజ్వా డేట్స్, అమెరికన్ డేట్స్, హార్మోనీ డేట్స్ ప్రత్యేకం. రంజాన్ మాసంలో ఖర్జూరానికి ప్రాధాన్యత ఉంది. సూర్యాస్తమయ సమయంలో కుటుంబాలు ఇఫ్తార్‌తో ఉపవాసం విరమిస్తారు. సంప్రదాయక ముస్లింలు మూడు ఖర్జూరాలతో ఉపవాసం విరమించే ఆచారాన్ని గుర్తు చేసుకోవడానికి వీటిని తినడం ద్వారా భోజనం ప్రారంభిస్తారని కాకినాడకు చెందిన డ్రై ఫ్రూట్స్ వ్యాపారి శ్రీనివాస్ తెలిపారు.వీటి ధరలు అజ్వా డేట్స్ ధర 250 గ్రాములు రూ.900, మెడ్జూల్ ధర కిలో రూ.2500, అమెరీ డేట్స్ కిలో రూ.1800 వరకు ఉంటున్నాయి. ఇవి పూర్తిగా ముంబై నుంచి ఇంపోర్ట్ చేసుకుంటున్నట్టుగా వ్యాపారులు చెబుతున్నారు.



డ్రై ఫ్రూట్స్..ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. బాదం, పిస్తా, జీడిపప్పు, కిస్‌మిస్, అంజీరా, ఖర్జూరం వంటి డ్రైఫ్రూట్స్ వినియోగం బాగా పెరిగింది. ఒకప్పుడు ధనికుల ఇళ్లల్లోనే ఎక్కువగా కనిపించేవి. ఉన్నత వర్గాలు వీటిని తినడం స్టేటస్ సింబల్‌గా భావించేవారు.మారుతున్న జీవన పరిస్థితుల్లో ఆరోగ్యంకోసం సాధారణ, మధ్యతరగతి ప్రజల్లోనూ వీటి వినియోగం కొంత పెరిగింది. డాక్టర్లు,ప్రకృతి వైద్యులు వీటిని తీసుకోవాలని ఎక్కువగా సూచిస్తుండడంతో చాలా మందికి డ్రైఫ్రూట్స్ దైనందిన జీవనంలో ఒక భాగంగా మారిపోయింది. ప్రధానంగా కరోనా మహమ్మారి తర్వాత ప్రజలకు ఆరోగ్యంపై శ్రద్ధ పెరిగింది. దీంతో డ్రైఫ్రూట్స్ వినియోగంపట్ల చైతన్యం పెరిగింది.ఖర్చుకు వెనుకాడడంలేదు.ఆరోగ్యకరమైన కొవ్వులు, యాంటీ ఆక్సిడెంట్స్, ఖనిజాలు పుష్కలంగా లభిస్తుంది. వీటి వల్ల ఇమ్యూనిటీ పెరుగుతుంది.రోగనిరోధక శక్తి పెరుగుతుంది.ఎన్నో రకాల ఆరోగ్య ప్రయోజనాలున్న ఈ డ్రైఫ్రూట్స్ వినియోగం సాధారణ రోజుల్లో కంటే రంజాన్‌వేళల్లో అధికంగా ఉంటుందని వ్యాపారులు చెబుతున్నారు.

- ఆంధ్రజ్యోతి-రాజమహేంద్రవరం అర్బన్/కాకినాడ

పల్లెలకూ షాపులు..

జిల్లాలోని కాకినాడ, రాజమహేంద్రవరం వంటి ప్రధాన నగరాలతో పాటు అమలాపురం, మండపేట, సామర్లకోట, పెద్దాపురం, రావులపాలెం, రామచంద్రపురం, అనపర్తి పిఠాపురం, పలు గ్రామాల్లోనూ డ్రైఫ్రూట్స్ వ్యాపారం బాగా పెరిగింది. కొవిడ్ తర్వాత ప్రజలు వీటి వాడకాన్ని పెంచారు. అంతకు ముందు అంతంతమాత్రంగా అమ్మకాలు జరిగేవి. కేవలం బాదంపప్పు, జీడిపప్పులను మాత్రమే కొనుగోలు చేసేవారు. కానీ నేడు అన్ని రకాల డ్రైఫ్రూట్స్‌ను కొనేవారి సంఖ్య పెరిగింది. ప్రస్తుతం కాకినాడ నగరంలో పది పెద్ద దుకాణాల్లో ప్రత్యేకించి డ్రైఫ్రూట్స్ మాత్రమే విక్రయిస్తున్నారు. రాజమహేంద్రవరం నగరంలోని శ్రీ వెంకటేశ్వర జనరల్ మార్కెట్, దివాన్‌చెరువు వంటి ప్రాంతాల్లో డ్రైఫ్రూట్స్ షాపులు పెద్దసంఖ్యలో ఏర్పాటయ్యాయి. రాజమహేంద్రవరంలోని మునిసిపల్ స్టేడియం చుట్టూ హోల్‌సేల్ డ్రైఫ్రూట్ షాపులు ఎక్కువగా కనిపిస్తాయి. ఒక్క రాజమహేంద్రవరంలోనే 25 కుపైగా హోల్‌సేల్ వ్యాపారులు ఉన్నారు. నగరాల్లో సాధారణ షాపులతోపాటు మోర్, రిలయన్స్, డీమార్ట్ వంటి షాపింగ్ మాల్స్‌లోను వీటిని ప్రత్యేకించి విక్రయిస్తుండడం విశేషం.

తింటే..ఆరోగ్యం

అరబ్ దేశాల నుంచే భారీగా దిగుమతులు

బాదం, పిస్తా, ఖర్జూరం, అంజీరా, వాల్‌నట్స్, అప్రికాట్ వంటి డ్రై ఫ్రూట్స్ రకాలన్నీ అరబ్ దేశాల నుంచే దిగుమతి చేసుకోవాల్సి ఉంటుంది. వాతావరణ పరిస్థితుల రీత్యా మన దేశంలో వీటి సాగు దాదాపుగా లేదు. మనదేశంలో ఒక్క కిస్‌మిస్ మాత్రం కొంత మేర దొరకుతుంది. మహారాష్ట్రలోని షాంఘ్లి నుంచి కిస్‌మిస్ దిగుమతి చేసుకున్నా చాలా తక్కువ క్వాంటిటీలోనే లభిస్తోంది. అరబ్ దేశాలైన ఇరాన్, ఇరాక్‌తో పాటు పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్ వంటి అరబ్ దేశాల నుంచి ఢిల్లీ, ముంబయికి చెందిన హోల్‌సేల్ వ్యాపారులు డ్రైఫ్రూట్స్‌ను తీసుకొస్తారు. అక్కడి నుంచి వయా హైదరాబాద్ టు రాజమహేంద్రవరం తీసుకొస్తారు. పిస్తా అమెరికా, అరబ్ దేశాల నుంచి దిగుమతి చేసుకుంటారు. ఎక్కువ అరబ్‌దేశాల నుంచే దిగుమతి అవుతోంది. ఖర్జూరంలో అనేక వెరైటీలు ఉన్నాయి.



అమ్మకాలు అంతంతమాత్రంగానే ఉన్నాయి..

కొవిడ్ తర్వాత డ్రైఫ్రూట్స్ వాడకం ఎక్కువైన మాట వాస్తవమే. దానికి తగినట్టు షాపులు పెరిగాయి.. గతంలో డ్రై ఫ్రూట్స్ షాపులు చాలా తక్కువగా ఉండేవి. నేడు ఎక్కడ చూసినా కనిపిస్తున్నాయి. మాల్స్‌లో కూడా లభ్యమవుతున్నాయి. రంజాన్ మాసంలో ముస్లిం సోదరులు డ్రై ఫ్రూట్స్‌ను ఎక్కువగా వినియోగిస్తారు. అయితే ఈ ఏడాది అమ్మకాలు అంతంతమాత్రంగానే ఉన్నాయి. సాధారణ రోజులతో పోల్చితే ఒక్కో ఐటమ్‌కు రెండు, మూడు కిలోలు మాత్రమే అదనంగా వ్యాపారం పెరిగిందన్నారు. - **వ్యాపారి, రాజమహేంద్రవరం**



సనాతన ధర్మమంటే ఏమిటో చెప్పాలి

- పవన్‌కల్యాణ్‌ను ప్రశ్నించిన సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

అమలాపురంటౌన్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): చేగువేరా వారసుడిని అని చెప్పి రాజకీయాల్లోకి వచ్చిన పవన్‌కల్యాణ్ బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ చెప్పినట్టు నడుచుకుంటున్నారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. నేడు సనాతన ధర్మం గురించి ఆయన మాట్లాడుతున్నారని అసలు సనాతన ధర్మమంటే ఏమిటో చెప్పాలన్నారు. ఇప్పటికే సమాజంలో కులవ్యవస్థ అంతకంతకూ పెరిగిపోతుందన్నారు. సనాతన ధర్మమంటే మనుధర్మాన్ని అమలు చేయడమా అన్నారు. అన్నమయ్య, పోతన, రామానుజాచార్యులు, కందుకూరి వీరేశలింగం పంతులు వంటి సమతావాదులకు తామంతా వారసులమన్నారు. వారంతా మన జాతి సంపద అని, మేము సగర్వంగా చెప్పుకుంటామని విలేకరులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు. మనుధర్మాన్ని అమలు చేస్తామంటే సహించబోమన్నారు. అమలాపురం ప్రెస్‌క్లబ్‌లో బుధవారం జరిగిన సమావేశంలో శ్రీనివాసరావు మాట్లాడుతూ పచ్చని కోనసీమలో తాగునీటి ఎద్దడి ఎక్కువగా ఉందన్నారు. పలుచోట్ల పైపులైన్లు, ట్యాప్‌లు వేసినప్పటికీ చుక్కనీరు సరఫరా చేయని దుస్థితి నెలకొందన్నారు. పంటకాల్వలు, డ్రైనేజీలుగా మారిపోయాయని, ఆక్వా కెమికల్ వ్యర్థాలతో వ్యవసాయం కూడా దెబ్బతినే పరిస్థితి ఏర్పడిందన్నారు. సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లాలో చేపట్టిన ప్రజా చైతన్య సైకిల్ యాత్రలో ఎన్నో సమస్యలను గుర్తించామన్నారు. సాంఘిక సంక్షేమశాఖ వసతిగృహాల్లో చదువుకుంటున్న విద్యార్థులకు కనీసం దోమతెరలు కూడా అందించడం లేదన్నారు.మంత్రి నాదెండ్ల మనోహర్ హాస్టల్ విద్యార్థులకు సన్నబియ్యం సరఫరా చేస్తామని హామీఇచ్చి ఇంతవరకు చేయలేదన్నారు. అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్నా డీఎస్సీ నిర్వహించకపోవడం శోచనీయమన్నారు. పీ-4 పథకం కేవలం పేదలను బిచ్చగాళ్లను చేయడం కోసమేనని విమర్శించారు. సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బి.బలరామ్, జిల్లా కన్వీనర్ వెంకటేశ్వరరావులు పాల్గొన్నారు.

గేట్‌లో యూసీఈకే విద్యార్థుల ప్రతిభ

- 86 మందికి ర్యాంకులు

జేఎన్టీయూకే, మార్చి 26(ఆంధ్రజ్యోతి): గేట్-2025 పరీక్షల్లో కాకినాడ జేఎన్టీయూకేలోని యూసీఈకే విద్యార్థులు ప్రతిభ కనబరచి జాతీయ స్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించినట్లు ప్రిన్సిపాల్ ఎన్. మోహన్‌రావు తెలిపారు. ఈసీఈ విద్యార్థులు సీహెచ్ సాయిచరణ్ 9వ ర్యాంకు, సివిల్ నుంచి ఐదుగురు విద్యార్థులు 1000 నుంచి 20,000లోపు, ఈఈఈ నుంచి 20 మంది 11 నుంచి 50,000లోపు, మెకానికల్ నుంచి 9 మంది 500 నుంచి 10,000లోపు ర్యాంకులు పొందారన్నారు. అదేవిధంగా ఈసీఈ నుంచి 28 మంది 9 నుంచి 50,000లోపు, సీఎస్ఈ నుంచి 15 మంది 100నుంచి 50,000లోపు, పీఈ సీఈ నుంచి 9 మంది 50 నుంచి 5000 లోపు ర్యాంకులు సాధించారన్నారు. మొత్తం 86 మంది విద్యార్థులు ర్యాంకులు సాధించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

బోటు బిల్డింగ్ యార్డ్ లీజు రద్దుచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న రంగారావు

- ప్రభుత్వమే నిర్వహణ చేపట్టాలి
- ఉమ్మడి జిల్లా మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు రంగారావు

కాకినాడ సిటీ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేసిన కాకినాడ బోటు బిల్డింగ్ యార్డు లీజు రద్దుచేసి మత్స్యశాఖ ఆధీనంలో ప్రభుత్వమే నిర్వహణ చేపట్టాలని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు బలసాడి రంగారావు కోరారు. స్థానిక జగన్నాధపురంలోని ఎస్‌ఐఎఫ్‌టీ భవనంలో బుధవారం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా మత్స్య సహకార సంఘం సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశానికి ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు బలసాడి రంగారావు అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథులుగా జిల్లా మత్స్య అభివృద్ధి అధికారి, డిప్యూటీ డైరెక్టర్ వి.కృష్ణారావు, జిల్లా మత్స్య సహకార సంఘం ఎండీ, అసిస్టెంట్ డైరెక్టర్ కె. కరుణాకరరావు విచ్చేశారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించి తీర్మానాలు చేశారు. ప్రధానమంత్రి మత్స్యకార యోజన పథకాన్ని రెండేళ్ల పొడిగించడంపట్ల ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలుపుతూ తీర్మానం చేశారు. కాకినాడ ఫిషింగ్ హార్బర్‌లోని ఆప్‌కాబ్ డీజిల్ బంక్ నిర్వహణను జిల్లా మత్స్య సహకార సంఘానికి అప్పగించాలని, సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు నేతృత్వంలో సీఎంను త్వరలో కలిసి మత్స్యకార సమస్యలు విన్నవించాలని, బోటు బిల్డింగ్ యార్డును ప్రభుత్వమే నిర్వహించాలని తీర్మానాలు చేశారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు రంగారావు మాట్లాడుతూ గతంలో ఎమ్మెల్యే కొండబాబు హయాంలో రూ.6కోట్ల స్మార్ట్ సిటీ నిధులతో ఆధునీకరించిన బోటు బిల్డింగ్‌యార్డులో కొన్ని పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయని, ఈ అభివృద్ధి పనులు పూర్తి చేయించేందుకు ప్రభుత్వం రూ.కోటి నిధులు విడుదల చేయాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా మత్స్యకార సంఘం వైస్ చైర్మన్ కొల్లు రాంబాబు, కో ఆప్షన్ సభ్యుడు అంపోలు సత్యనారాయణ, బోర్డు డైరెక్టర్లు, సొసైటీ అధ్యక్షులు పాల్గొన్నారు.

గోవింద నామస్మరణతో గరుడవాహన సేవ

- కొనసాగుతున్న స్వామివారి అధ్యయనోత్సవాలు

ఆత్రేయపురం, మార్చి 26(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామివారి వార్షిక కల్యాణోత్సవాలకు ముందుగా నిర్వహించే అధ్యయనోత్సవాలు బుధవారరం రెండవ రోజు ఘనంగా నిర్వహించారు. వేకువజామునే గోదావరి జలాలను తీసుకువచ్చి స్వామివారికి మేల్కొలుపు నిర్వహించారు. అనంతరం వసంత మండపంలో పండితులు ద్రవిడ వేద పారాయణం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. అధ్యయనోత్సవాలలో భాగంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కేరళ కళాకారుల వాయిద్యాలు భక్తులను అలరించింది. సాయంత్రం వేద పారాయణం నిర్వహించారు. మేళతాళ మంగళవాయిద్యాలు నడుమ శ్రీవారు గరుడవాహన సేవ అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ ఉపకమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు ఏర్పాట్లు నిర్వహించారు. అశేష భక్తజనం పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.



వాడపల్లిలో గరుడ వాహనంపై స్వామివారి గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

జీజీహెచ్‌లో మరో జీబీఎస్ కేసు

జీజీహెచ్ (కాకినాడ), మార్చి26 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జీజీహెచ్‌లో వైద్యసేవల కోసం మరో గులియన్ బారే సిండ్రోమ్ (జీబీఎస్) కేసు నమోదైంది. ఒకరు ఆరోగ్యంగా కోలుకోవడంతో బుధవారం డిశ్చార్జి చేసినట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి తెలిపారు. ప్రస్తుతం ఐదుగురు బాధితులు చికిత్స పొందుతున్నారన్నారు. జీబీఎస్ కేసులకు వైద్య చికిత్స, మందులు, వ్యాక్సిన్లు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. ఎలాంటి భయాందోళనకు గురవ్వరాదన్నారు.

హుండీల ఆదాయం రూ.15లక్షలు

ఐ.పోలవరం, మార్చి 26(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలం మురమళ్ల వీరేశ్వరస్వామి హుండీల ఆదాయం 110రోజులకు రూ.15,73,843లు వచ్చినట్లు ఆలయ ఏసీ మాచిరాజు లక్ష్మీనారాయణ తెలిపారు. ప్రధాన ఆలయ హుండీ ద్వారా రూ.8,75,849లు, నిత్యకళ్యాణం, కట్నకానుకల ద్వారా రూ6.04లక్షలు, అన్నదానం హుండీ ద్వారా రూ.93,061లు సమకూరినట్టు తెలిపారు. మూడు విదేశీ నోట్లు కూడా వచ్చాయన్నారు. అమలాపురం దేవదాయశాఖ తనిఖీ అధికారి జె.రామలింగేశ్వరరావు పర్యవేక్షణలో బుధవారం హుండీల ఆదాయం లెక్కించారు.

వర్షపు నీటిని సంరక్షించాలి

- పర్యావరణవేత్త వెంకట యాదవ్
- 'నన్నయ'లో జాతీయ వర్క్‌షాప్



జ్యోతి ప్రజ్వలనతో సభను ప్రారంభిస్తున్న వీసీ ప్రసన్నశ్రీ

దివాన్‌చెరువు, మార్చి 26(ఆంధ్రజ్యోతి): అందరూ తమ ఇంటిపై పడిన వర్షపు నీటిని తామే సంరక్షించుకుంటే నీటి కోసం యుద్ధాలు అవసరం లేదని హైదరాబాద్‌కు చెందిన పర్యావరణవేత్త సిద్దనబోయిన వెంకట యాదవ్ అన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో నీటి సంరక్షణ, భవిష్యత్ సవాళ్లు అనే అంశంపై బుధవారం నిర్వహించిన జాతీయ వర్క్‌షాప్‌కు వీసీ ఎస్.ప్రసన్నశ్రీ, సిద్దనబోయిన ముఖ్య అతిథులుగా విచ్చేసి జ్యోతిప్రజ్వలనతో సభను ప్రారంభించారు. సిద్దనబోయిన మాట్లాడుతూ మన ఇంటి కింద 1.50 లక్షల లీటర్ల నీరు పట్టే సంపుతో ఇంటి నిర్మాణం చేపట్టాలని, ఇది నేటి కాలంలో చాలా ప్రాంతాల్లో ఆదర్శంగా నిలిచిందన్నారు. నన్నయ వర్సిటీని ప్రకృతి ఒడిగా తీర్చిదిద్దేందుకు సహకారం అందిస్తామన్నారు. వీసీ మాట్లాడుతూ సరిపడ నీరు తాగకపోతే శరీరంలో అవయవాలు పాడవుతాయన్నారు. యూనివర్సిటీలో నీటిఎద్దడి అధికంగా ఉందని, దానిని అధిగమించేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నామన్నారు. వెంకటయాదవ్ సహకారంతో పర్యావరణ అభివృద్ధి, నీటి సంరక్షణ కార్యక్రమాలు చేపడతామన్నారు. అనంతరం పర్యావరణం, నీటి సంరక్షణపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా పోటీల్లోని విజేతలకు సర్టిఫికెట్లు అందజేశారు. రిజిస్ట్రార్ జి.సుధాకర్, వర్సిటీ ఇంజనీర్ కె.నూకరత్నం, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రాచీన ఆలయాల ఆదాయం రూ.14.91 లక్షలు



బిక్కవోలులో లక్ష్మీగణపతి ఆలయ హుండీ లెక్కిస్తున్న సిబ్బంది, భక్తులు


బిక్కవోలు, మార్చి 26(ఆంధ్రజ్యోతి): బిక్కవోలులోని ప్రాచీన శ్రీలక్ష్మీగణపతి, శ్రీగోలింగేశ్వర స్వామి ఆలయాల హుండీలను బుధవారం లెక్కించగా రూ.14.91లక్షల ఆదాయం సమకూరినట్టు ఈవో ఆకెళ్ల భాస్కర్ తెలిపారు. రామచంద్రపురం తనిఖీ అధికారి ఆర్.బాలాజీరామ్‌ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ లెక్కింపులో శ్రీలక్ష్మీగణపతి హుండీల నుంచి రూ.10,97,441, శ్రీగోలింగేశ్వరస్వామి హుండీల నుంచి రూ.3,96,859 ఆదాయ వచ్చిందని తెలిపారు. మూడు నెలల 20 రోజులకుగాను ఈ ఆదాయం లభించినట్టు ఈవో పేర్కొన్నారు.

28, 29 తేదీల్లో ఐడియల్‌లో జాతీయస్థాయి సదస్సు

కాకినాడ రూరల్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): కాకినాడ సామర్లకోటరోడ్డులోని ఇంద్రపాలెంలాకుల వద్దఉన్న ఐడియల్ డిగ్రీకళాశాలలో ఈనెల 28,29 తేదీల్లో జాతీయస్థాయి సదస్సును నిర్వహించనున్నట్లు కళాశాల కార్యదర్శి, కరస్పాండెంట్ సదస్సు చీఫ్ ప్యాట్రన్ డాక్టర్ పి.చిరంజీవినీకుమారి తెలిపారు. కళాశాల రసాయన, భౌతికశాస్త్ర విభాగాల ఆధ్వర్యం లో కన్వర్జెన్స్ ఆఫ్ కెమిస్ట్రీ అండ్ ఫిజిక్స్ ఇన్ అడ్వాన్స్‌డ్ నానోమెటీరియల్స్ అండ్ నానో టెక్నాలజీ అనే అంశంపై రెండురోజుల పాటూ ఈ సదస్సు జరుగుతుందన్నారు. దీనిలో ముఖ్యఅతిథులుగా దేశవ్యాప్తంగా ప్రఖ్యాతిగాంచిన వివిధ విశ్వవిద్యాలయాల సీనియర్ ప్రొఫెసర్లు, శాస్త్రవేత్తలు, పారిశ్రామిక సాంకేతిక నిపుణులు హాజరుకానున్నారని తెలిపారు. వివిధ యూనివర్శిటీలు, కళాశాలల ప్రొఫెసర్లు, అధ్యాపకులు తమ పేపర్లను అందజేయాలని కోరారు. ఈ సదస్సుకు ప్యాట్రన్‌గా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.సత్యనారాయణ, కన్వీనర్‌గా కెమిస్ట్రీ విభాగాధిపతి కె.రాజేంద్రకుమార్, సమన్వయకర్తగా ఫిజిక్స్ విభాగాధిపతి జి.రాజు, సహ సమన్వయకర్తగా బి.శ్రీనివాస్, గౌరవ సలహాదారుడిగా ప్రసాద్, నిర్వహణ కమిటీ సభ్యులుగా సిరి, జ్యోతి, సాయి కళ్యాణి వ్యవహరించనున్నారన్నారు.

శృంగారవల్లభస్వామి దేవస్థానం షాపులకు వేలం

- రూ.10.57లక్షల ఆదాయం



వేలం పాట నిర్వహిస్తున్న దృశ్యం

పెద్దాపురం, మార్చి 26(ఆంధ్రజ్యోతి): కాకినాడజిల్లా పెద్దాపురం మండలంలోని తిరుపతి గ్రామంలో బుధవారం నిర్వహించిన ఆశీల పాట ద్వారా పంచాయతీకి రూ.10.57 లక్షలు సమకూరినట్లు పంచాయతీ కార్యదర్శి ఒగ్గు భార్గవ్ తెలిపారు. శృంగారవల్లభస్వామి దేవస్థానానికి వచ్చే వాహనాలకు పార్కింగ్ ఫీజు వసూలు నిమిత్తం రూ.6.60 లక్షలకు లక్కరాజు రామకృష్ణ, దుకాణాల నుంచి ఆశీలు వసూలుకు సంబంధించి రూ.3.97లక్షలు దంటు వీరబాబు దక్కించుకున్నట్లు తెలిపారు. సర్పంచ్ మొయిళ్ల కృష్ణమూర్తి, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్రిక్తత... ఉత్కంఠ!

● రాజమహేంద్రవరం ప్రభుత్వ బోధనాసుపత్రి వద్ద రోజంతా టెన్షన్ టెన్షన్

● భారీగా మోహరించిన పోలీసులు

● పోస్టుమార్టం అనంతరం పాస్టర్ ప్రవీణ్ మృతదేహం హైదరాబాద్ తరలింపు

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ క్రైస్తవ సువార్తీకుడు ప్రవీణ్ పగడాల అనుమానాస్పద మృతి నేపథ్యంలో బుధవారం రాజమహేంద్రవరం ప్రభుత్వ బోధనాసుపత్రి వద్ద రోజంతా ఉద్రిక్తత, ఉత్కంఠ పరిస్థితులు నెలకొన్నాయి. తూర్పుగోదావరి జిల్లాకు చెందిన క్రైస్తవ సంఘాల నాయకులు, క్రైస్తవులు, ప్రవీణ్ ఫాలోవర్స్‌తో పాటు తెలంగాణ జిల్లాలు, ఖమ్మం ప్రాంతానికి చెందిన క్రైస్తవ ప్రముఖులు పెద్దసంఖ్యలో ఆసుపత్రికి చేరుకోవడంతో ఆ ప్రాంతంలో ఉద్రిక్త పరిస్థితులు ఏర్ప డ్డాయి. దీంతో పోలీసులు భారీగా మోహరించారు. ఆసుపత్రి ఆవరణలోని పోలీస్ అవుట్‌పోస్టు సమీపంలో క్రైస్తవ విశ్వాసులు పెద్దసంఖ్యలో మోకాలి ప్రార్థనలతో, నినాదాలతో ప్రవీణ్‌కు న్యాయం జరగాలని కోరుతూ ప్రార్థనలు చేశారు. అన్ని ఫార్మాలిటీస్ ముగిసిన అనంతరం సాయంత్రం 4.30 గంటల ప్రాంతంలో సువార్తీకుడు ప్రవీణ్ పగడాల మృతదేహాన్ని ఒక ప్రైవేట్ అంబులెన్స్‌లో హైదరాబాద్ తరలించారు. జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్ ప్రభుత్వ బోధనాసుపత్రికి చేరుకుని శాంతిభద్రతలు, ఇతర అంశాలను పర్యవేక్షించారు. రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ కూడా ఆసుపత్రికి వచ్చి బాధిత క్రైస్తవ సంఘీయులకు న్యా యం జరిగేలా చూస్తామని ప్రకటించారు. ప్రవీణ్ పగడాల మృతి విషయాన్ని సీఎం చంద్రబాబు, మంత్రులు నారా లోకేశ్, హోంమంత్రి అనిత దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. ఈ విషయంలో సమగ్ర దర్యాప్తు చేయాల్సిందిగా సీఎం ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారని, మృతి కారణాలు సాధ్యమైనంత త్వరగా బయటకు వస్తాయన్నారు. కాగా ప్రభుత్వ బోధనాసుపత్రి ఆవరణలోని పోలీస్ అవుట్‌పోస్టులో ప్రవీణ్ మృతదేహానికి శవ పంచనామా జరిపారు. అనంతరం మార్చురీలో పోస్టుమార్టం పూర్తి చేశారు. ఈ ప్రక్రియ మొత్తం సాయంత్రం 4.30 గంటల వరకూ కొనసాగడంతో ఆసుపత్రి ఆవరణతోపాటు మెయిన్‌గేటు పరిసర ప్రాంతాల్లో ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి.

కేఏ పాల్‌ను అడ్డుకున్న పోలీసులు

సాయంత్రం మూడున్నర ప్రాంతంలో ప్రజాశాంతి పార్టీ వ్యవస్థాపకుడు కేఏ పాల్ రాజమహేంద్రవరం ప్రభుత్వబోధనాసుపత్రికి చేరుకున్నారు. అక్కడి నుంచి పోస్టుమార్టం జరుగుతున్న మార్చురీగది లోపలకు వెళ్లడానికి ప్రయత్నించగా కేఏ పాల్‌ను పోలీసులు అనుమతించలేదు. ఈ సమయంలో కేఏ పాల్‌కు, మాజీ ఎంపీ హర్షకుమార్ తనయునికి కొంత వాగ్వివాదం చోటుచేసుకుంది. అనంతరం ఆసుపత్రి మార్చురీ వద్ద కేఏ పాల్ హైడ్రామా కొనసాగింది. ఓపెన్‌టాప్ జీపుపై కేఏ పాల్ తన మద్దతుదారులు, క్రైస్తవ సంఘీయులకు అభివాదం చేస్తూ సువార్తీకుడు ప్రవీణ్ పగడాలది ప్రమాదం కాదని, హత్య అని భావిస్తున్నామని ఆరోపించారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్ కొద్దిరోజులుగా అన్‌నెస్ససరీగా మాట్లాడడం వల్లే ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయన్నారు. ప్రవీణ్ మర ణం విషయంలో రాష్ట్రంలోని కోర్టుల్లో న్యాయం జరగపోతే అవసరమైతే సుప్రీంకోర్టుకు వెళతామని ఆయన పేర్కొన్నారు. మాజీ ఎంపీ హర్షకుమార్ ఆందోళనా కార్యక్రమం వద్దకు చేరుకుని జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్‌తో మాట్లాడారు. ఈ సంఘటనపై పూర్తి స్థాయి విచారణ జరపాలని కోరారు. పోస్టుమార్టం కార్యక్రమాలను సైతం పర్యవేక్షించారు.

ఆఖరి క్షణాలు.. ఇలా!

వీడియో కెమెరాల్లో నమోదైన సీసీ ఫుటేజ్ ప్రకారం.. హైదరాబాద్ నుంచి బుల్లెట్‌పై వస్తున్న పాస్టర్ ప్రవీణ్ సోమవారం రాత్రి 11 గంటల 31 నిమిషాలకు తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు టోల్ గేటు దాటారు. ఆ సమయంలో బుల్లెట్ హెడ్ లైటు వెలగడం లేదు. కుడివైపు సిగ్నల్ లైటు మాత్రమే బ్లింక్ అవుతోంది. తర్వాత 11 గంటల 42 నిమిషాల 6 సెకన్లకు(11 నిమిషాలు) బుల్లెట్ నయారా పెట్రోల్ బంక్ వద్దకు చేరుకుంది(ఈ రెండు ప్రాంతాల మధ్య దూరం 10-11 కిలో మీటర్లు.) సరిగ్గా బంకుకు ఎదురుగా రోడ్డు పైనుంచి ఎడమవైపు గట్టు కిందకు ప్రవీణ్ బుల్లెట్‌తో సహా పడిపోయారు. బుల్లెట్ కింద పడిపోతున్న సమయంలో దాని పక్క నుంచి ఎరుపు రంగు కారు వెళ్తున్నట్టుగా కనిపిస్తోంది. ఆ వెంటనే లారీ కూడా వెళ్లింది.



రాజమహేంద్రవరంలో ప్రభుత్వ బోధనాసుపత్రి వద్ద ప్రార్థన చేస్తున్న క్రైస్తవులు



పాస్టర్ ప్రవీణ్ మృతదేహాన్ని అంబులెన్స్‌లో భారీ బందోబస్తు మధ్య హైదరాబాద్‌కు తరలిస్తున్న పోలీసులు



మార్చురీ గదిలోకి అనుమతించ లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కేపీ పాల్



పోస్టుమార్టం కోసం ఇంక్వెస్ట్ సిద్ధం చేస్తున్న అధికారులతో మాట్లాడుతున్న హర్షకుమార్

రంగంలోకి ఐదు బృందాలు : ఎస్పీ



పాస్టర్ ప్రవీణ్ కుమార్ మృతి కేసు దర్యాప్తు వేగంగా జరుగుతోందని ఎస్పీ నరసింహ కిశోర్ తెలిపారు. ప్రస్తుతం అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశామన్నారు. కొవ్వూరు డీఎస్పీ దేవకుమార్ ఆధ్వర్యంలో 5 ప్రత్యేక బృందాలు నిజం నిగ్గుతేల్చే పనిలో నిమగ్నమయ్యాయని చెప్పారు. అధునాతన సాంకేతికత సహాయంతో అన్ని కోణాల్లో పరిశీలన చేస్తున్నామన్నారు. పాస్టర్ ప్రవీణ్ చివరిసారి మోహన్‌రావు అనే స్థానిక వ్యక్తితో ఫోన్‌లో మాట్లాడారని గుర్తించినట్టు తెలిపారు. శవ పరీక్షను వీడియో తీసినట్టు చెప్పారు. ఈ ఘటనపై ఎవరి వద్ద ఎలాంటి సమాచారం ఉన్నా తమకు తెలియజేయాలని కోరారు. వదంతులు ప్రచారం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఘటనా స్థలంలో కర్రలపై ఉన్న రక్తపు మరకలను, దుస్తులను ఫోరెన్సిక్ నిపుణులకు పంపించామని ఆయన వెల్లడించారు.

క్రైస్తవులు 29న రాజమహేంద్రవరం తరలిరండి

మాజీ ఎంపీ హర్షకుమార్

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 25(ఆంధ్రజ్యోతి): పాస్టర్ ప్రవీణ్ పగడాల మరణం దురదృష్టకరమని, దీనిపై భవిష్యత్ కార్యాచరణ చేపట్టి రాష్ట్ర వ్యాప్త ఉద్యమం చేసేందుకు ఈనెల 29న రాజమహేంద్రవరం హోలీట్రినిటి చర్చ్ గ్రౌండ్ వద్దకు క్రైస్తవ సోదరులంతా తరలిరావాలని అమలాపురం మాజీ ఎంపీ హర్షకుమార్ పిలుపునిచ్చారు. ప్రవీణ్ పోస్టుమార్టం రిపోర్టు ఈనెల 29న వస్తుందని ప్రభుత్వాసుపత్రి సూపరింటిండెంట్ చెప్పారన్నారు.

ప్రవీణ్ మరణం కలచివేసింది : షఫీ

పాస్టర్ ప్రవీణ్ మరణం తమను కలచివేసిందని అంతర్జాతీయ ముస్లీం మైనార్టీ సువార్తీకుడు షఫీ అన్నారు. రాజమండ్రి ప్రభుత్వాసుపత్రి వద్ద ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపి వాస్తవాలు బహిర్గతంచేయాలన్నారు.

కారు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

ఆలస్యంగా వెలుగులోకి ఘటన



పిఠాపురంలో మరణించిన వ్యక్తి

పిఠాపురం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మరణించాడు. ప్రమాదానికి కారణమైన కారుతో అందులోని వ్యక్తులు అక్కడి నుంచి పరారయ్యారు. ఈనెల 24న జరిగిన ఈ సంఘటన బుధవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పట్టణంలోని స్టువర్టుపేట వద్ద గల మారుతి వైన్స్ ఎదురుగా రోడ్డు దాటుతున్న గుర్తు తెలియని వ్యక్తిని కారు ఢీకొనడంతో అక్కడికక్కడే మరణించాడు. అతడి వయస్సు 60 సంవత్సరాలు ఉంటుంది. బిచ్చగాడిగా పోలీసులు భావిస్తున్నారు. ప్రమాదానికి కారణమైన కారుతో అందులోని వ్యక్తులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. సీసీ టీవీ ఫుటేజీ ఆధారంగా కారుని, ఆ వ్యక్తులను పోలీసులు గుర్తించారు. పిఠాపురం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కుటుంబ కలహాలతో కాలువలో దూకి ఆత్మహత్య

పెరవలి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో తూర్పుగోదావరి జిల్లా పెరవలి వద్ద కాలువలో దూకి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మంగళవారం జరగగా బుధవారం మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఖండవల్లికి చెందిన చల్లా దుర్గారావు (29)కు భార్యతో విబేదాలు ఉన్నాయి. తరచూ గొడవలు పడుతుండడంతో మనస్తాపం చెందిన దుర్గారావు మంగళవారం పోలీసు స్టేషన్‌కు వెళ్లి అక్కడి నుంచి లాకుల వద్దకు చేరుకుని కాలువలోకి దూకేశాడు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.



చల్లా దుర్గారావు మృతదేహం

రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీ

లారీ చక్రాల కింద పడి ఇద్దరి మృతి

మహిళకు తీవ్ర గాయాలు

జె.కొత్తూరులో ఘోర రోడ్డు ప్రమాదం

జగ్గంపేట రూరల్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా జగ్గంపేట రూరల్ మండలం జె.కొత్తూరు గ్రామంలో వినాయకుని గుడి వద్ద బుధవారం రాత్రి ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా ఓ మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. గోకవరం మండలం జగన్నాథపురం గ్రామానికి చెందిన బొందల నాగు(28) తన సోదరితో కలిసి బైక్ పై స్వగ్రామానికి వెళ్తున్నారు. ఆ సమయంలో జగ్గంపేట మండలం గోవిందపురం గ్రామానికి చెందిన ఇల్లా వరహాలు(48) జగ్గంపేట వైపు వెళుతున్నాడు. జె.కొత్తూరు వినాయక గుడి వద్దకు వచ్చేసరికి రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొని ఇద్దరు రోడ్డుపై పడిపోవడంతో వెనుక నుంచి వస్తున్న లారీ వీరి మీద నుంచి దూసుకుపోయింది. దీంతో ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందారు. బైక్‌పై ప్రయాణిస్తున్న మహిళ కాలు పై నుంచి లారీ వెళ్లడంతో తీవ్రంగా గాయపడింది. దీంతో ఆమెను జగ్గంపేటలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. సంఘటనా స్థలాన్ని ఎస్ఐ రఘునాథరావు పరిశీలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తరలించినట్టు చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. విషయం తెలియగానే మృతుల బంధువులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు.



మరణించిన నాగు (ఫైల్‌ఫొటో)

ఫొటోషూట్‌కు వచ్చి... ప్రాణాలు విడిచి

గోదావరిలో స్నానానికి దిగి యువకుడి మృతి

ఆత్రేయపురం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ఫొటోషూట్ కోసం వచ్చిన యువకుడు తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయాడు. వివరాల్లోకి వెళితే తూర్పుగోదావరి జిల్లా రాజానగరం మండలం కొత్తతుంగపాడు గ్రామానికి చెందిన ఆలపాటి కిషోర్(19) పదోతరగతి చదువుకుని కూలీ పనిచేసుకుంటున్నాడు. బుధవారం మధ్యాహ్నం తన స్వగ్రామంలోని బంధువుల ఇంట జరిగిన శుభకార్యానికి వెళ్లి సందడి చేశాడు. అక్కడే ఉన్న తన మిత్రులతో కలిసి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం పిచ్చుకలంక వద్దకు చేరుకున్నారు. కాటన్‌బ్యారేజీ, పిచ్చుకలంక గోదావరి నదీతీరంలో ఉల్లాసంగా గడిపారు. ప్రకృతి అందాలు ఇసుక తిన్నెలలో ఫోటోషూట్‌లు తీసుకున్నారు. సాయంత్రం వరకు అక్కడే స్నేహితులతో గడిపి గోదావరి నదిలో స్నానాలు ఆచరించారు. గోదావరిలో స్నానం చేసిన కిషోర్ ఊబిలో కూరుకుపోయాడు. బంధుమిత్రులు సంఘటనా స్థలానికి చేరుకుని మత్స్యకారుల సహాయంతో గాలింపు చర్యలు చేపట్టారు. కూరుకుపోయిన చోట రాత్రి కిషోర్ మృతదేహం లభ్యమైంది. సమాచారం తెలిసిన వెంటనే ఎస్ఐ ఎస్.రాము ఘటనా స్థలానికి చేరుకున్నారు. శవపంచనామ నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కిషోర్ తండ్రి శ్రీను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. కిషోర్ మృతదేహం వద్ద బంధుమిత్రుల రోదనలు చూపరులను కంటతడి పెట్టించాయి.



ఆలపాటి కిషోర్(ఫైల్)

గోదావరిలో దూకి యువకుడి గల్లంతు

రాజానగరం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజానగరానికి చెందిన మునసా వీరబాబు (19) బుధవారం రాజమహేంద్రవరంలో రోడ్డు కం రైలు వంతెనపై నుంచి దూకి గల్లంతయ్యాడు. వివరాలిలా ఉన్నాయి. రాజానగరంలోని న్యాకాలనీకి చెందిన వీరబాబు రాజమహేంద్రవరంలోని ఆటో నగర్‌లో కారు మెకానిక్ పని నేర్చుకుంటున్నాడు. రోజు మాదిరిగానే పనిలోకి వెళ్తున్నానని చెప్పిన వీరబాబు బుధవారం ఉదయం 6గంటలకు రాజానగరంలోని వెంకీ అనే మిత్రుడితో కలిసి బైక్‌పై ఇంటి వద్ద నుంచి బయలుదేరారు. ఈ క్రమంలో వీరబాబు పనిలోకి రాలేదని మెకానిక్ షాపు నుంచి ఇంటికి ఫోన్ వచ్చింది. దీంతో ఎక్కడికి వెళ్లాడని ఆరా తీస్తే రంపచోడవం పార్టీకి వెళ్లినట్టుగా తెలుసుకున్నారు. రంపచోడవరం నుంచి తిరుగు ప్రయాణంలో కోరుకొండ లోని సమీప బంధువుల ఇంటికి బుధవారం సాయంత్రం 4గంటల సమయంలో వెళ్లి వారితో కొద్దిసేపు మాట్లాడిన వీరబాబు కొంతసొమ్ము అడిగి తీసుకున్నట్టు తెలుస్తోంది. అక్కడి నుంచి రాజమహేంద్రవరం చేరుకుని మేనత్త ఇంటికి వెళ్లి అక్కడి నుంచే ఫోన్‌లో ఎక్కువసేపు మాట్లాడినట్టు తెలుస్తోంది. అనంతరం ఫోన్ తన స్నేహితుడికి ఇచ్చి తాను గోదావరిలో దూకేస్తున్నానని ఈ విషయం తన అన్నయ్యకు చెప్పమన్నాడు. దీంతో ఆందోళన చెందిన స్నేహితుడు వెంకీ ఎంత వారించినా వినకుండా వీరబాబు ఒక్కసారిగా గోదావరిలో దూకేశాడు. స్నేహితుడు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు రాజానగరంలోని కుటుంబ సభ్యులకు ఫోన్ చేశారు. కుటుంబ సభ్యులు రాజమహేంద్రవరం హుటాహుటీన బయలుదేరి వెళ్లారు.



మునసా వీరబాబు (ఫైల్)

చోరీ కేసుల్లో నిందితుడి అరెస్టు



స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాలు



నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీహరిరాజు

అన్నవరం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా అన్నవరం పోలీస్‌స్టేషన్ పరిధిలో 2చోరీ కేసుల్లో నిందితుడిని పట్టుకుని 90గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్టు పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు తెలిపారు. గతేడాది డిసెంబరులో కత్తిపూడిలోని ఓ ఇంటి తలుపులు పగలుగొట్టి బంగారు ఆభరణాలు దొంగిలించగా, ఈ ఏడాది ఫిబ్రవరి 10న జాతీయ రహదారిపై ఉన్న నమూనాలయం వద్ద బస్సులో ప్రయాణించే మహిళ మెడలో నగలు దొంగిలించిన కేసులో గుంటూరు జిల్లా దాచేపల్లికి చెందిన బైసాని సందీప్‌ను కత్తిపూడి బ్రిడ్జి వద్ద బుధవారం పోలీసులు అరెస్టు చేశారు. చోరీ చేసిన బంగారు ఆభరణాల విలువ సుమారు రూ.7.20 లక్షలు ఉంటుందని పేర్కొన్నారు. సమావేశంలో ఎస్ఐ హరిబాబు తదితరులున్నారు.

ఆర్టీసీ క్రెడిట్ కోఆపరేటివ్ సొసైటీ సభ్యుల

అభ్యున్నతికి కృషి

సొసైటీ చైర్మన్ ద్వారకా తిరుమలరావు



అమలాపురంలో మాట్లాడుతున్న ఆర్టీసీ ఎండీ, సొసైటీ చైర్మన్ తిరుమలరావు

అమలాపురం టౌన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ క్రెడిట్ కోఆపరేటివ్ సొసైటీ సభ్యుల అభ్యున్నతి కోసం కృషి చేస్తానని ఆ సంస్థ ఎండీ, సొసైటీ చైర్మన్ సీహెచ్ ద్వారకా తిరుమలరావు పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాం నుంచి పెండింగ్‌లో ఉన్న రూ.96కోట్ల బకాయిల విడుదలకు కృషి చేస్తున్నట్టు ప్రకటించారు. గతంలోనే బకాయిలు విడుదల చేయాలని అప్పటి ప్రభుత్వానికి సూచించినా పట్టించుకోలేదన్నారు. ఇప్పటికే ప్రభుత్వంతో బకాయిలు విడుదల కోసం చర్చించానని, త్వరలోనే విడుదల కానున్నట్టు తెలిపారు. సభ్యులంతా సమన్వయంతో పనిచేస్తూ సొసైటీని మరింత అభివృద్ధి పథంలోకి తీసుకురావాలని సూచించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం ఏబీసీడీ ఫుడ్ కోర్టు భవనంలో బుధవారం సొసైటీ కార్యదర్శి టి.త్రాసు అధ్యక్షతన జరిగిన సమావేశంలో చైర్మన్, వైస్‌చైర్మన్, ఈడీ జి.నాగేంద్రప్రసాద్, ఫైనాన్స్ అండ్ ఆడిట్ ఈడీ ప్రసాద్, కార్యదర్శి టి.త్రాసు మాట్లాడారు. ప్రతీ ఆరునెలలకు ఒకసారి సమావేశం నిర్వహించడం జరుగుతుందని, తొలి సమావేశాన్ని విజయవాడలో నిర్వహిస్తామని, కోనసీమలో తొలిసారిగా రాష్ట్రస్థాయి సమావేశం నిర్వహించామన్నారు. 1952లో సొసైటీని ఏర్పాటు చేసి సంఘ సభ్యుల నుంచి డిపాజిట్లు సేకరించడంతో పాటు అవసరమైన వారికి రుణాలను అందిస్తున్నామన్నారు. తిరుమలరావు మాట్లాడుతూ ఏపీఎస్ ఆర్టీసీ క్రెడిట్ కోఆపరేటివ్ సొసైటీ ఆసియా ఖండంలోనేనంబర్‌వన్ స్థానంలో నిలిచిందన్నారు. 46వేల మంది సభ్యులతో రూ.2500 కోట్ల టర్నోవర్‌తో సొసైటీ ఎన్నో మంచి కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. సంఘ సభ్యుల పిల్లల చదువులకు, పెళ్లిళ్లకు రూ.15లక్షల నుంచి రూ.20లక్షల వరకు రుణాలను అందిస్తున్నామన్నారు. క్రెడిట్ సొసైటీ భవనం నిర్మాణం విషయంలో ఎంప్లాయీస్ యూనియన్, నేషనల్ మజ్దూర్ యూనియన్ల ప్రతినిధుల మధ్య వివాదం జ రగగా కొద్దిసేపు సమావేశంలో గందరగోళం ఏర్పడింది. అనంతరం త్రాసు ఆధ్వర్యంలో పలు తీర్మానాలను ఆమోదించారు. 230 మంది డెలిగేట్స్ హాజరైన సమావేశంలో కమిటీ సభ్యులు శ్రీనివాసరాజు, అనంతరామయ్య, వి.ప్రసాద్, వినోద్ పాల్గొన్నారు.

వెంటిలేటర్ పైనే అంజలి

కొన ఊపిరితో

కొట్టుమిట్టాడుతున్న విద్యార్థిని

ఆశగా ఎదురుచూస్తున్న తల్లిదండ్రులు

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 26(ఆంధ్రజ్యోతి): తనకు జరిగిన అన్యాయానికి మనస్తాపం చెంది ఇంజక్షన్ చేసుకుని ఆత్మహత్యకు ప్రయత్నించిన ఎన్.అంజలి రాజమహేంద్రవరం కిమ్స్ బొల్లినేని ఆసుపత్రిలో ఐసీయూలో వెంటిలేటర్‌పై ఊపిరి తీసుకుంటుంది. కిమ్స్ ఆసుపత్రిలో పనిచేసే ఏజీఎం దీపక్ మోసం చేయడంతో అంజలి ఈనెల 23న ఆసుపత్రిలోనే మత్తు ఇంజక్షన్ తీసుకుని అపస్మారక స్థితికి చేరుకుంది. ఆమె డైరీలో రాయడంతో తన ఆవేదన బయటపడింది. దీనిపై విద్యార్థి సంఘాలు, బంధువులు స్పందించి ఆందోళనకు దిగాయి. తండ్రి ఫిర్యాదు మేరకు ప్రకాష్‌నగర్ పోలీసులు స్టేషన్‌లో దీపక్‌పై కేసు నమోదు చేశారు. దీపక్ కుటుంబంతో సహ పరారీలో ఉన్నాడు. మరోపక్క ఆసుపత్రి వద్ద పరిస్థితి అనుక్షణం ఆందోళనకరంగా ఉంది. అంజలి పరిస్థితి విషమంగా ఉండడంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరవుతున్నారు. 3రోజులుగా అంజలి వెంటిలేటర్‌పై కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతోంది. ఎన్నో కలలతో ఉన్నతంగా ఉద్యోగంలో స్థిరపడి కుటుంబంతో ఆనందంగా ఉండాలని ఊహించుకుని ఫార్మ్‌డి ఫైనలియర్ చదువుతున్న అంజలి జీవితం ఊహించని మలుపుతిరిగింది. తనకు జరిగిన అన్యాయంపై తిరగబడలేని సగటు యువతిగా బాధలను తట్టుకుని, అవమానాలు దిగమింగుకుని చివరికి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. బుధవారం అంజలికి వైద్యులు కొన్ని పరీక్షలు నిర్వహించినట్టు, అయితే ఆమె పరిస్థితిలో ఎటువంటి మార్పులు లేవని తెలిసింది. అంజలి కోసం ఆమె తల్లిండ్రులు ఎదురుచూస్తున్నారు. ప్రకాష్‌నగర్ పోలీసులు కేసు దర్యాప్తు వేగవంతం చేశారు. దీపక్ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఆసుపత్రిలో జరిగిన సంఘటనలపై విచారణ జరుగుతుంది.

అదనపు కట్నం కోసం అత్తింటి వేధింపులు ఎక్కువై...

ఉరేసుకున్న గర్భిణి



ప్రవళ్లిక (ఫైల్)

తాళ్లరేవు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): అదనపు కట్నం కోసం అత్తింటివారి వేధింపులు ఎక్కువై ఓ గర్భిణి ఉరివేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలం జి.వేమవరం గ్రామానికి చెందిన సలాది ప్రవళ్లిక(21)కు కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం గండివారిపాలెనికి చెందిన గండి రాంబాబుతో ఏడాది క్రితం వివాహమైంది. ఆమె ప్రస్తుతం 4 నెలల గర్భిణి. గత 5 నెలలుగా అత్తింటివారితో అదనపు కట్నం కోసం గొడవలు జరుగుతున్నాయి. ఇరువర్గాల పెద్దలతో తగువులు జరిగాయి. మంగళవారం ప్రవళ్లికపై వేధింపులు ఎక్కువ కావడంతో ఇంట్లో చున్నీతో ఉరి వేసుకుని ఆత్మహ త్య చేసుకున్నట్టు స్థానికులు చెబుతున్నారు. నా కుమార్తెను అత్తింటి వేధింపులతో హత్యచేశారని ప్రవళ్లిక తండ్రి సత్యనారాయణ ఆరోపించాడు. ఘటనపై కోరింగ పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు తెలిపాడు.

పసికందు ప్రాణాలు విడిచింది!

ఏలూరు ఆసుపత్రిలో

చికిత్స పొందుతూ మృతి

నల్లజర్ల, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలం పోతవరంలో ఓ శిశువును ఎవరో ముళ్లకంచెలో పడవేయగా కుక్కలు దాడి చేసి గాయపరిచిన విషయం పాఠకులకు విదితమే. మంగళవారం ఈ విషాద ఘటన జరగగా మెరుగైన వైద్యం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఉదయం శిశువును 10గంటలకు ఏలూరు ఆసుపత్రిలో చేర్పిస్తే మధ్యాహ్నం 3 గంటల వరకు వైద్య సేవలు అందించడంలో ఆలసత్వం వహించారు. 3 గంటలకు ప్రారంభించిన వైద్య సేవలతో శిశువు అర్ధరాత్రి 12గంటల వరకు కొన ప్రాణంతో కొట్టుమిట్టాడింది. చివరికి చికిత్స పొందుతూ మరణించింది. సకాలంలో వైద్య సేవలందించి ఉంటే శిశువు బతికే అవకాశం ఉందని, వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే పసికందు మృత్యువాత పడిందని పలువురు విమర్శలు గుప్పిస్తున్నారు.

బాలబాలాజీ ఆదాయం రూ.18,90,148

మామిడికుదురు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం అప్పనపల్లి బాలబాలాజీ హుండీలను బుధవారం లెక్కించగా రూ.18,90,148 ఆదాయంగా వచ్చిందని సహాయ కమిషనర్ ఎం.సత్యనారాయణరాజు తెలిపారు. 36 రోజులకు ఆలయ ప్రధాన హుండీలను లెక్కించగా పై ఆదాయంతో పాటు 8.200 గ్రాముల బంగారం, 13 గ్రాముల వెండి వచ్చినట్టు చెప్పారు.

పాసింజర్ ఆటోను ఢీకొన్న వ్యాన్

తొమ్మిదిమంది మహిళలకు గాయాలు

తాళ్లరేవు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం సుంకరపాలెం అంబేడ్కర్‌నగర్ ప్రాంతంలో ప్రయాణిస్తున్న పాసింజర్ ఆటోను బొలేరో వ్యాన్ ఢీకొనడంతో 9 మంది మహిళలకు స్వల్ప గాయాలయ్యాయి. కోరింగ పోలీసుల వివరాల ప్రకారం.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కె.గంగవరం మండలం సత్యవాడకు చెందిన 9మంది మహిళలు పాసింజర్ ఆటోలో ప్రయాణమై ఉప్పలగుప్తం గ్రామంలో శుభకార్యానికి వెళ్లారు. సుంకరపాలెం అంబేడ్కర్‌నగర్ రహదారి ప్రాంతంలో వెనుక నుంచి వేగంగా వచ్చిన బొలేరో వ్యాన్ ఆటోను ఢీ కొనడంతో ఆటో పల్టీలు కొట్టి 9మంది గాయాలపాలయ్యారు. క్షతగాత్రులను స్థానికులు యానాం ప్రభుత్వాసుపత్రికి అంబులెన్స్‌లో తరలించగా వైద్యులు ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రవేటు ఆసుపత్రికి తరలించినట్టు తెలిపారు. కోరింగ ఎస్ఐ పి.సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉలిక్కిపడ్డ సత్యవాడ

కె.గంగవరం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): సత్యవాడ గ్రామం నుంచి మహిళలు ఆటోలో ఉప్పలగుప్తం వెళుతున్న సందర్భంలో తాళ్లరేవు మండలంలో రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. ఈ సంఘటనతో సత్యవాడ గ్రామం ఉలిక్కిపడింది. సత్యవాడకు చెందిన గొల్టి బాల ఉప్పలగుప్తంలో తన మనుమడి చిన్నకార్యం కోసం బయలుదేరింది. సత్యవాడ నుంచి ఆటోలో తనతో పాటు 9మంది కలిసి బయలుదేరి ప్రమాదానికి గురయ్యారు. మందపాటి విజయ కుమారి తలకు బలమైన గాయమైంది. ఆమెకు కాకినాడలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స చేయిస్తున్నారు. కొందరు యానాం ఆసుపత్రి, మరికొందరు కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్టు స్థానికులు చెప్పారు. ప్రమాదంలో ఎవరికి ప్రాణహాని కలగకపోవడంతో గ్రామస్తులు ఊపిరిపీల్చుకున్నారు.



గాయాలపాలైన మహిళలు

పంచాయతీ డెవలప్‌మెంట్ ప్లాన్ పూర్తి చేయాలి

డీఎల్‌పీవో నాగలత


వేమగిరి పంచాయతీలో జీపీడీపీ వివరాలను పరిశీలిస్తున్న నాగలత

కడియం, మార్చి 26(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం డివిజన్ పరిధిలో అన్ని పంచాయతీలు 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి డెవలప్‌మెంట్ ప్లాన్ (జీపీడీపీ) వెంటనే పూర్తి చేయాలని డివిజనల్ పంచాతీయ అధికారి ఎం.నాగలత ఆదేశించారు. రాబోయే ఆర్థిక సంవత్సరానికి చేపట్టవలసిన అభివృద్ధి పనులు, కేటాయించాల్సిన నిధులు వంటి వన్నీ ఆన్‌లైన్ ద్వారా పూర్తి చేసి వెంటనే ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలన్నారు. వేమగిరిలో జీపీడీపీని పరిశీలించారు. ఆర్థిక సంవత్సరం ముగుస్తున్న నేపథ్యంలో తక్షణమే పంచాయతీలు జీపీడీపీలు సిద్ధం చేయాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి ఎం.రూప్‌చంద్, సచివాలయ కార్యదర్శి పాపారాయుడు తదితరులు పాల్గొన్నారు.

పంచ ప్రాధాన్యాల పనులకు అధిక ప్రాధాన్యం

ఏపీవో అప్పలరాజు


సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఏపీవో అప్పలరాజు

గోకవరం, మార్చి 26(ఆంధ్రజ్యోతి): రానున్న వేసవి దృష్ట్యా ఉపాధి హామీ పథకంలో చేపట్టనున్న పంచ ప్రాధాన్యాల పనుల నిర్వహణకు అధిక ప్రాధాన్యమివ్వనున్నట్టు ఎంపీడీవో గోవిందు, ఉపాధి ఏపీవో అప్పలరాజు అన్నారు. స్థానిక ఉపాధి కార్యాలయంలో సిబ్బందితో బుధవారం నిర్వహించిన సమీక్షా సమావేశానికి వారు విచ్చేసి మాట్లాడారు. పశువుల నీటితొట్టెల నిర్మాణం, ఫారంపాండ్‌ల ఏర్పాటు, పంట కాలువల్లో పూడికతీత, సాగు నీటి చెరువులను శుభ్రం చేయడం, సగటు వేతనం రూ.290 వచ్చేవిధంగా కూలీలతో పని చేయించడం వంటి అంశాలపై సిబ్బందితో ఏపీవో చర్చించారు. ఉన్నతి కార్యక్రమంలో భాగంగా 100 రోజులు పని పూర్తిచేసుకున్న కుటుంబాల్లోని అర్హులైన యువతకు నైపుణ్యతతో కల్గిన పనులపై శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించనున్నట్టు అప్పలరాజు తెలిపారు. కార్యక్రమంలో టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

నర్సరీలు పెంచాలంటే కళాత్మక దృష్టి ఉండాలి

సెంట్రల్ జైలు సూపరింటెండెంట్ రాహుల్

కడియం, మార్చి 26(ఆంధ్రజ్యోతి): నర్సరీ అనేది పర్యావరణ కళాత్మక రంగమని రాజమహేంద్రవరం సెంట్రల్‌జైలు సూపరింటెండెంట్ ఎస్.రాహుల్ అన్నారు. బుధవారం కడియపులంక పల్ల సుబ్రహ్మణ్యం నర్సరీని ఆయన సందర్శించారు. నర్సరీలో మొక్కల పెంపకం, వాటి ఉత్పత్తి పర్యావరణానికి ఎంతో అవసరమన్నారు.కాగా జైలులో ఖైదీల సహకారంతో మొక్కలు తయారు చేస్తూ పెంచుతున్నామని, వాటికి నర్సరీ రైతుల సహకారం కావాలన్నారు. సుబ్రహ్మణ్యం వివిధ రకాల మొక్కలు గురించి రాహుల్‌కు వివరించారు. కార్యక్రమంలో సెంట్రల్ జైల్ డిప్యూటీ సూపరింటెండెంట్ ఎం.రాజకుమార్, చిలుకూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అఘాయిత్యాలకు పాల్పడితే కఠిన చర్యలు

పోక్సో చట్టంపై అవగాహన సదస్సులో జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ సెక్రటరీ శ్రీలక్ష్మి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న శ్రీలక్ష్మి

రాజానగరం, మార్చి 26(ఆంధ్రజ్యోతి): సమాజంలో ఆడపిల్లలపై అఘాయిత్యాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ(డీఎల్ఎస్ఏ) సెక్రటరీ శ్రీలక్ష్మి పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ భవనంలో బుధవారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు ఆమె ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. చిన్న వయస్సులో పిల్లలు చదువుపై దృష్టి సారించాలి తప్ప ఎటువంటి ఆకర్షణలకు లోనుకాకూడదన్నారు. క్రమశిక్షణతో విద్యనభ్యసిస్తూ మంచి ఉద్యోగంలో స్థిరపడాలని ఆకాంక్షించారు. తొమ్మిదేళ్లు నిండిన ఆడపిల్లల్ని తల్లి దగ్గర తప్ప మరే ఇతర మగ వ్యక్తుల వద్ద ఉంచ కూడదన్నారు. సెల్‌ఫోన్ వాడేట ప్పుడు వారు ఎటువంటి వీడియోలు చూస్తున్నారో గమనించాలన్నారు. 18 ఏళ్ల లోపు ఆడపిల్లలపై ఎటువంటి దాడులు జరిగినా పోక్సో చట్టం ద్వారా కఠినమైన శిక్షలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ పి.వి జయకుమారి, సీడీపీవో టి.నాగమణి, అడ్వకేట్ జి.దేవి భవాని, సూపర్‌వైజర్లు ఎన్‌కే దుర్గామణి, ఎన్.భూదేవి, ఎస్.సింహాచలం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి ఆలయానికి రూ.లక్ష విరాళం


ఆలయ కమిటీకి విరాళం అందజేస్తున్న కంబాల శ్రీనివాసరావు

రాజానగరం, మార్చి 26(ఆంధ్రజ్యోతి): మండలంలో నరేంద్రపురంలోని వేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షుడు, బీజేపీ నాయకులు కంబాల శ్రీనివాసరావు రూ.లక్ష విరాళాన్ని అందజేశారు. ఆలయానికి రంగులు వేయించడానికి చాట్ల పద్మారావు ఆధ్వర్యంలో గోకవరం-తంటికొండ రోడ్డులోని సీఎండీ కార్యాలయం వద్ద నగదు చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా కంబాల మాట్లాడుతూ ఆలయాల అభివృద్ధికి, పేదల సంక్షేమానికి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో బీజేపీ గోకవరం, రాజానగరం మండలాల అధ్యక్షులు ఇన కోటి బాపన్నదొర, ఆళ్ల శివనాగరాజు, నాయకులు వెంకటేష్, వరసాల ప్రసాద్, దాసరి ధర్మ రాజు, బత్తుల నానాజీ, నాగరమేష్, వీరాంజలి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్షలకు ఏడుగురు గైర్హాజరు

బిక్కవోలు, మార్చి 26(ఆంధ్రజ్యోతి): మండలంలో బుధవారం జరిగిన పదో తరగతి ఫిజికల్ సైన్సు పరీక్షకు ఏడుగురు విద్యార్థులు గైర్హాజరైనట్టు మండల విద్యాశాఖాధికారి సీహెచ్‌వీవీ సత్యనారాయణ తెలిపారు. బలభద్రపురం సెంటర్ నుంచి ఇద్దరు, పందలపాక సెంటర్ నుంచి ఐదుగురు హాజరు కాలేదన్నారు.

రంగంపేటలో నలుగురు గైర్హాజరు..

రంగంపేట, మార్చి 26(ఆంధ్రజ్యోతి): రంగంపేట మండలంలో బుధవారం వడిశలేరు, రంగంపేట, సింగంపల్లి హైస్కూల్లో జరిగిన పదో తరగతి భౌతికశాస్త్ర పరీక్షలకు 581 మంది విద్యార్థులకు గాను 577 మంది హాజరు కాగా నలుగురు గైర్హాజరయ్యారని ఎంఈవో పి.మధుసూధనరావు తెలిపారు. రంగంపేటలో 212 మందికి 210 మంది, వడిశలేరులో 185 మందికి 184 మంది, సింగంపల్లి హైస్కూల్లో 184 మందికి 183 మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనట్టు పేర్కొన్నారు.

రాజమహేంద్రవరం సమగ్ర అభివృద్ధే లక్ష్యం

ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు


సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వాసు

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 26(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరాన్ని సమగ్రంగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. స్థానిక 9వ డివిజన్ కోకా భాస్కర్‌నగర్‌లో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులకు బుధవారం మాజీ కార్పొరేటర్ కొసూరి చండీప్రియతో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏనాడో ప్రారంభం కావాల్సిన అభివృద్ధి పనులు ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ వల్ల వాయిదా పడి ప్రస్తుతం జరుగుతున్నాయన్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక నగరంలో సుమారు రూ.10 కోట్ల విలువైన పనులు పూర్తయ్యాయని, మరో రూ.23.51 కోట్ల పనులు జరుగుతున్నాయన్నారు. నగరాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని కష్టపడుతున్నామన్నారు. నగరాన్ని కల్చరల్, స్పోర్ట్స్ హబ్‌గాను, ఆరోగ్యకరమైన నగరంగాను తయారు చేస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పాస్టర్ ప్రవీణ్ మృతిపై సమగ్ర విచారణ జరపాలి: ఏఐవైఎఫ్

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై పోలీసులు సమగ్ర విచారణ జరపాలని, అవసరమైతే సీబీసీఐడీకి అప్పగించాలని ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.త్రిమూర్తులు డిమాండ్ చేశారు. ఈమేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేస్తూ పాస్టర్ ప్రవీణ్ మృతిపై ప్రజల్లో అనేక అనుమానాలు ఉన్నాయని తెలిపారు. క్రైస్తవ ప్రచారం కారణంతోనే ఆయన చనిపోయి ఉంటారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని, ఈ నేపథ్యంలో కేసును సీఐడీకి అప్పగించడం ద్వారా వాస్తవాలు బయటకు వస్తాయని ఆయన పేర్కొన్నారు.

డెల్టా కాలువలకు 10,700 క్యూసెక్కులు

ధవళేశ్వరం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): కాటన్ బ్యారేజ్ నుంచి వ్యవసాయ అవసరాల కోసం డెల్టా కాలువల ద్వారా 10,700క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. తూర్పుడెల్టాకు 3200క్యూసెక్కులు, మధ్యడెల్టాకు 2000క్యూసెక్కులు, పశ్చిమడెల్టాకు 5500క్యూసెక్కులు విడుదలఅవుతున్నాయి. గోదావరిలో నీటి లభ్యత 10,468క్యూసెక్కులుగా కాగా ధవళేశ్వరం వద్ద నీటి మట్టం 9.55అడుగులుగా నమోదయింది.

రంగంపేట అభివృద్ధికి సహకరించాలి

» కాలువల అభివృద్ధికి రూ.80 లక్షల మంజూరు .. త్వరలో పనులు
» మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే నల్లమిల్లి


పీఎంఅజయ్‌లో మంజూరైన ఆటోను అనూషకు అందిస్తున్న ఎమ్మెల్యే

రంగంపేట,మార్చి 26 (ఆంధ్రజ్యోతి): రంగంపేట మండలాభివృద్ధికి పార్టీలకు అతీతంగా అందరూ సహకరించాలని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ రిమ్మలపూడి శ్రీదేవి అధ్యక్షతన జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి ఆయన విచ్చేసి మాట్లాడారు. అభివృద్ధి, సంక్షేమం ధ్యేయంగా ప్రభుత్వం పాలిస్తోందన్నారు. మండలంలోని చాగల్నాడు, వెంకటనగరం కాలువల అభివృద్ధికి రూ.80 లక్షల మంజూర య్యాయని, త్వరలోనే పనులు చేపడతామన్నారు. అనంతరం అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులతో మండలంలోని వివిధ సమస్యలపై చర్చించి పరిష్కరించే దిశగా చర్య లు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ పేపకాయల రాంబాబు, ఎంపీపీ రిమ్మలపూడి శ్రీదేవి, ఎంపీడీవో వి.సాయిబాబు, తహశీల్దార్ కోసు అనసూయ, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

సబ్సిడీ రుణాలను వినియోగించుకోవాలి

ప్రధాన మంత్రి అనుసుచిత్ జాతి అభ్యుదయ యోజన (పీఎంఅజయ్) పథకంలో భాగంగా రంగంపేటలో డ్వాక్రా సంఘాల్లోని ఎస్సీ మహిళలకు మంజూరైన ఆటోను ఆకుమర్తి అనూషకు ఎమ్మెల్యే నల్లమిల్లి బుధవారం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సబ్సిడీ రుణాలను సద్వినియోగం చేసుకొని డ్వాక్రా సంఘాల్లోని సభ్యులు సొంతంగా వ్యాపారం చేసుకుంటూ ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆళ్ల గోవిందు, ఎలుగుబంటి సత్తిబాబు, పూసల శ్రీనివాస్, ఉద్దండ్రావు శ్రీను, కొమ్మన రాంబాబు, బలిరెడ్డి దుర్గారావు, పి.చిన్నికాపు పాల్గొన్నారు.

చేతి వృత్తులకు కూటమి ప్రోత్సాహం

» ఆదరణ-3 పథకంపై అవగాహన సదస్సులో ఎమ్మెల్యే గోరంట్ల


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గోరంట్ల

కడియం, మార్చి 26(ఆంధ్రజ్యోతి): చేతి వృత్తులకు కూటమి ప్రత్యేక ప్రోత్సాహం ఇస్తోందని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఆదరణ-3 అవగాహన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. ఆనాటి టీడీపీ హయాంలో ఆదరణ పథకం పేరుతో కుల వృత్తుల వారికి అనేక రకాల పనిముట్లు అందించారని, గత ప్రభుత్వం ఈ పథకాన్ని తుంగలోకి తొక్కి. ప్రజలకు ఇవ్వాల్సిన పనిముట్లను గోదాములకు పరిమితం చేసి తుప్పు పట్టి పాడైపోయేలా చేసిందన్నారు. సమావేశానికి విచ్చేసిన నాయకులు ఏఏ వృత్తుల వారికి ఏఏ పరికరాలు అవసరమో గుర్తించి అధికారులకు తెలపాలన్నారు. కార్యక్రమం లో ఎంపీడీవో కె.రమేష్, వైస్ ఎంపీ పీలు పంతం గణపతి, కలిదిండి విశాలాక్షి, మార్గాని సత్యనారాయణ, ప్రత్తిపాటి రామారావుచౌదరి, చెల్లుబోయిన శ్రీనివాస్, సర్పంచ్‌లు మోసిగంటి సత్యవతి, చెక్కపల్లి మురళీకృష్ణ, పాటంశెట్టి రాంజీ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే గోరంట్లకు సత్కారం

రాజమహేంద్రవరం రూరల్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): తూర్పు కాపులకు ఓబీసీ సర్టిఫికెట్లు ఇచ్చేందుకు సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారని, త్వరలోనే సర్టిఫికెట్లు ఇచ్చేందుకు కృషి చేస్తారని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో తూర్పు కాపులకు ఓబీసీ సర్టిఫికెట్ ఇప్పించాలని సీఎం, డిప్యూటీ సీఎంల దృష్టికి గోరంట్ల తీసుకెళ్లిన సందర్భంగా రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి మజ్జి పద్మావతి ఆధ్వర్యంలో నియోజకవర్గ తూర్పు కాపులు ఎమ్మెల్యే గోరంట్లను సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా గోరంట్ల మాట్లాడుతూ కోస్తాంధ్రలోని అన్ని జిల్లాల్లో వృత్తి, వ్యాపార, ఉద్యోగ రీత్యా తూర్పుకాపులు స్థిరపడి ఉన్నారని రాజమహేంద్రవరం సిటీ, రూరల్, రాజానగరం పరిధిలో అధిక సంఖ్యలో ఉన్నారన్నారు. వీరు రిజర్వేషన్లు కోల్పోవడం వల్ల విద్య, ఉపాధి, ఉద్యోగ రంగాల్లో ఇబ్బందులు పడుతున్నారని, వారికి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

మండలంలోని కాతేరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన కంప్యూటర్ లాబ్‌ను ఎమ్మెల్యే గోరంట్ల బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవ్యాంధ్ర ప్రదేశ్‌ను డిజిటల్ ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో గంగిన హనుమంతరావు, యానాపు ఏసు, తదితరులు పాల్గొన్నారు.

ముస్లిం మైనార్టీల అభివృద్ధికి కృషి

ధవళేశ్వరం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ముస్లిం మైనార్టీల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి పేర్కొన్నారు. స్థానిక రజా మసీదులో ఏర్పాటుచేసిన ఇఫ్తార్ విందుకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ ఆరోగ్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోరంట్ల రవిరామ్‌కిరణ్, షేక్ మహ్మద్, పండూరి అప్పారావు, మచ్చేటి ప్రసాద్, పిన్నంటి ఏకబాబు, తలారి మూర్తి, వర్రే రాజేష్ పాల్గొన్నారు.

బలభద్రపురంలో హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు ఉమామహేశ్వరరావు


సమావేశంలో మాట్లాడుతున్న ఉమామహేశ్వరరావు

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం బలభద్రపురంలో తక్షణమే హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించి, ప్రజారోగ్యాన్ని రక్షించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బలభద్రపురంలో సీపీఎం బృందం పర్యటించిందని, ఈ సందర్భంగా అక్కడి ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను తమ దృష్టికి తీసుకువచ్చారని చెప్పారు. వారం రోజుల్లో కేన్సర్‌తో ఇద్దరు మరణించారన్నారు. వైద్యఆరోగ్యశాఖ అక్కడ నిర్వహించిన సర్వే సమగ్రంగా లేదన్నారు. బలభద్రపురంతో పాటు సింగంపల్లి, నల్లమిల్లి, బాలవరం, దొంతమూరు, కాపవరం గ్రామాల్లో సుమారు 50 వేల మంది జనాభా ఉన్నారని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన వైద్యశిబిరంలో గడచిన రెండురోజుల్లో ఓపి 260కి మించలేదన్నారు. గత రెండేళ్లలో బలభద్రపురంలో కేన్సర్‌తో 25 మంది మృతిచెందినట్లు సర్పంచ్ రామారావు ఆ జాబితాను ప్రకటించారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా స్పందించాల్సిన అవసరం ఉందన్నారు. గ్రాసింగ్ పరిశ్రమ వ్యర్థాల విడుదల, కాలుష్య తీవ్రతపై కాలుష్య నియంత్రణ మండలితో పాటు, పర్యావరణ నిపుణులతో పరిసర గ్రామాల్లో గాలి, నీరు, నేల కాలుష్యనియంత్రణపై స్పష్టత ఇవ్వాలని కోరారు. పరిశ్రమల నిబంధనలను యాజమాన్యాలు యథేచ్ఛగా ఉల్లంఘిస్తున్నాయని, అటువంటి వాటిపై కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు. జిల్లా కార్యదర్శి టి.అరుణ్ మాట్లాడుతూ ఫార్మసీ విద్యార్థిని అంజలి ఘటనపై బొల్లినేని యాజమాన్యం స్పందించాలని, నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగ పాస్టర్ ప్రవీణ్ మృతి ఘటన దారుణమని, గతంలో తనకు ప్రాణహాని వుందని ప్రవీణ్ ప్రకటించిన విషయాన్ని గుర్తుచేశారు. దీనిపై సమగ్ర విచారణ జరపాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. సమావేశంలో నాయకులు జువ్వల రాంబాబు, బి.పవన్, టి.తులసి, కె.రామకృష్ణ పాల్గొన్నారు.

మోనటరింగ్ కమిటీ సమావేశం

రాజమహేంద్రవరం, మార్చి 26(ఆంధ్రజ్యోతి): ప్యానల్, డిఫెన్స్ కౌన్సెల్ న్యాయవాదులతో 9వ జిల్లా అదనపు జడ్జి ఎం.మాధురి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎన్.శ్రీలక్ష్మి బుధవారం సమావేశం నిర్వహించారు. వివిధ కేసుల్లో ఉచిత న్యాయ సహాయం విషయంలో పురోగతిపై ఆయా న్యాయవాదులను అడిగి తెలుసుకున్నారు. కేసుల సత్వర పరిష్కారంలో ఎలాంటి సమస్యలు ఉన్నా వెంటనే డీఎల్ఎస్ఏకి తెలియజేయాలని పేర్కొన్నారు.క్రిమినల్ కేసుల్లో బెయిల్ కోసం చేసుకున్న అర్జీలపై ఆరా తీశారు.

జాతీయ బీసీ సంక్షేమ సంఘం లీగల్‌సెల్ ఉపాధ్యక్షుడిగా మూర్తి



కడియం, మార్చి 26(ఆంధ్రజ్యోతి): జాతీయ బీసీ సంక్షేమ సంఘం లీగల్‌సెల్ ఉపాధ్యక్షుడిగా బుర్రిలంక గ్రామానికి చెందిన గోకుల్ నర్సరీ అధినేత దండుబోయిన వీరవెంకట సత్యనారాయణ మూర్తిని నియమిస్తున్నట్టు ఆ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య ప్రకటించారు. బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వై.నాగేశ్వరరావు, ఇన్‌చార్జి వై.నూకాలమ్మ ఆధ్వర్యంలో రాజమహేంద్రవరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మూర్తి ధ్రువీకరణ పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీల హక్కుల కోసం, వారికి న్యాయం చేసేందుకు నిబద్ధతతో పనిచేస్తానన్నారు. మూర్తికి రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ బత్తుల నాగేశ్వరరావు శుభాకాంక్షలు తెలిపారు.

ఉమారామలింగేశ్వరస్వామి కళ్యాణం



కడియం, మార్చి 26(ఆంధ్రజ్యోతి): వీరవరంలో శ్రీఉమా రామలింగేశ్వరస్వామి కల్యాణం వేద మంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ వైభవంగా జరిగింది. ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి స్వామి వారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు కల్యాణాన్ని తిలకించారు. ఈ సందర్భంగా రథోత్సవం, ఆలయం వద్ద భారీ అన్నసమారాధన జరిగాయి.

విద్యాసంవత్సరం ప్రారంభం కాకుండానే అడ్మిషన్లా?

పీడీఎస్‌యూ నిరసన

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : విద్యాసంవత్సరం ప్రారంభం కాకముందే కొన్ని ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు అడ్మిషన్లు చేపడుతున్నాయని, ఇలాంటి కళాశాలలపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.కిరణ్‌కుమార్ కోరారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేస్తూ జిల్లా వ్యాప్తంగా కొన్ని ప్రైవేట్ కళాశాలలు ముందస్తు అడ్మిషన్లు చేస్తూ నిబంధనలు తుంగలోతొక్కుతున్నాయని, విద్యాశాఖ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

డ్రైనేజీల్లో ఉన్న పైప్‌లైన్లను తొలగించండి

నగర వాసులకు సదుపాయాలు సక్రమంగా అందాలి: కమిషనర్ కేతన్ గార్గ్


డ్రైనేజీలో చెత్తను ప్లాస్టిక్ వ్యర్థాలను పరిశీలిస్తున్న కమిషనర్ కేతన్ గార్గ్

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 26(ఆంధ్రజ్యోతి): డ్రైనేజీల్లో ఉన్న పైప్‌లైన్లను వెంటనే తొలగించాలని కార్పొరేషన్ అధికారులను కమిషనర్ కేతన్‌గార్గ్ ఆదేశించారు. బుధవారం ఆయన నగరంలోని గోపాల్‌నగర్ పుంత రోడ్డు, శ్రీనివాస గార్డెన్స్ ప్రాంతాలలో నిర్మిస్తున్న రోడ్లను, ఆవరోడ్డు వాంబేకాలనీ డ్రైనేజీలను, పారిశుధ్య పరిస్థితిని బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డ్రైనేజీలలో చెత్తచెదారాలు, వీధుల వెంబడి వాస్తవ పరిస్థితిని పరిశీలించారు. నగరంలో మెరుగైన పారిశుధ్య నిర్వహణకు, డ్రైనేజీల గోడలను రోడ్డుకు అనుగుణంగా ఎత్తు పెంచడం, మురుగునీటి పారుదల తదితర అంశాలపై శానిటేషన్ విభాగానికి పలు సూచనలు చేశారు. అదేవిధంగా స్థానిక 16వ డివిజన్‌లో ఆవ వాంబేకాలనీ 100 అడుగుల రోడ్డులో కాలువ వాటిపై స్లాబులను పరిశీలించారు. ఆదేశించారు. నగర ప్రజలకు సదుపాయాలు సక్రమంగా అందేలా చూడాలని, పెద్దకాలువలో చెత్తను తొలగించే కార్యక్రమం వెంటనే చేపట్టాలని ఆదేశించారు. ఈ పర్యటనలో ఈఈ రీటా, డీఈఈ వెంకట లక్ష్మి, లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

న్యాక్‌లో ఎస్సీ నిరుద్యోగ యువతకు ఉచిత నైపుణ్య శిక్షణ

ధవళేశ్వరం, మార్చి 26(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా నేషనల్ అకాడమీ ఆఫ్ కనస్ట్రక్షన్ ఆధ్వర్యంలో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా పీఎం యోజన పథకంలో పదో తరగతి పాసైన ఎస్సీ నిరుద్యోగ యువతీయువకులకు యూనియన్ సాఫ్ట్‌వేర్ డెవలపర్, డొమెటిక్స్ ఐటీ హెల్ప్‌డెస్క్ అటెండెడ్, ట్రైలరింగ్, అసిస్టెంట్ హెయిర్ స్టైలిస్ట్ కోర్సులలో ఉచిత శిక్షణ ఇచ్చి సెంట్రల్ గవర్నమెంట్ సర్టిఫికెట్ ఇవ్వనున్నట్టు న్యాక్ నోడల్ అధికారి టి.మురళీధర్ ఓ ప్రకటనలో తెలిపారు. శిక్షణా కాలంలో ఉచిత వసతి, భోజన సౌకర్యం ఉంటుందని, శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు ఉద్యోగం కల్పిస్తామన్నారు. 18నుంచి 45ఏళ్ల వయసున్న వారు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. అడ్మిషన్ల కోసం బొమ్మూరులోని కలెక్టర్ భవనంలో ఉన్న న్యాక్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. మరిన్ని వివరాలకు అసిస్టెంట్ డైరెక్టర్ జె.రాజును 98664 43303 నెంబర్లో సంప్రదించాలని కోరారు.

పాస్టర్ ప్రవీణ్ మృతిపై సమగ్ర విచారణ జరపాలి

స్వతంత్ర జనతా పార్టీ చీఫ్ బర్రే ఆనందకుమార్

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 26(ఆంధ్రజ్యోతి): పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై ప్రభుత్వం నిష్పక్షపాతంగా సమగ్ర విచారణ జరపాలని స్వతంత్ర జనతా పార్టీ చీఫ్ బర్రే ఆనందకుమార్ బుధవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. గతంలో ఇదే ప్రాంతంలో జరిగిన ప్రమాదాలను సరిపోల్చాలని, మత పరమైన విద్వేషాలు చెలరేగకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. ఇదిలా ఉండగా పాస్టర్ ప్రవీణ్ మృతి దురదృష్టకరమని, దీనిపై సమగ్ర దర్యాప్తు జరిపి అనుమానాలను నివృత్తి చేయాలని మహిళా కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఎం.శారద ఓ ప్రకటనలో కోరారు.

ట్రాఫిక్..జామ్..

» నానా ఇబ్బందులకు గురైన గర్భిణులు, బాలింతలు
» పోలీసుల ఆంక్షలతో ఆసుపత్రికి వచ్చే రోగులకు తప్పని అవస్థలు





రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద రీతిలో మృతి చెందిన క్రైస్తవ సువార్తీకుడు ప్రవీణ్ పగడాల మృతదేహానికి బుధవారం రాజమహేంద్రవరం ప్రభుత్వ బోధనాసుపత్రి మార్చురీలో పోస్టుమార్టం నిర్వహిస్తున్న నేపథ్యంలో జిల్లా పోలీసులు భారీ ఎత్తున బందోబస్తు చేపట్టారు. ఈ క్రమంలో కంబాలచెరువు-లాలాచెరువు మార్గంలో రాకపోకలు సాగించే ఆర్టీసీ బస్సులు, ఇతర ప్రైవేట్ వాహనాలు, ఆటోలు వంటి వాటన్నింటినీ దారి మళ్లించారు. లాలాచెరువు వైపు నుంచి వచ్చే వాహనాలు సీటీఆర్ఐ జంక్షన్ మీదుగా క్వారీ మార్కెట్ వైపు, కంబాలచెరువు వైపు నుంచి వచ్చే వాహనాలు సెంట్రల్ జైలు ఎదురుగా జడ్జిబంగ్లా రిజర్వాయర్ వైపునకు దారి మళ్లించారు. దీంతో వివిధ ఆరోగ్య సమస్యలపై ఆసుపత్రికి వచ్చే రోగులతోపాటు, గర్భిణీలు, బాలింతలకు తీవ్ర ఇబ్బందిపడ్డారు. బాలింతలు సుదూరప్రాంతం నడుచుకుంటూ వెళ్లాల్సి వచ్చింది. వారి సహాయకులు చిన్నారులను ఎత్తుకుని నడుచుకుంటూ తమ వాహనాల వద్దకు వెళ్లడం కనిపించింది. ఆసుపత్రి డాక్టర్లు, ఉద్యోగులు సైతం బయటకు వచ్చేదారిలేక అవస్థలు పడ్డారు. ఇలా ఉదయం నుంచి సాయంత్రం ఆరున్నర గంటల వరకూ ఆసుపత్రికి వచ్చే రోగులు, వారి సహాయకులు ఇబ్బందులు పడ్డారు.

మృత్యువుతో పోరాడి ఓడిన శిశువు 8



'ఆంధ్రజ్యోతి' లక్కీడ్రా నేడే!

ఆంధ్రజ్యోతి యూనిట్ కార్యాలయంలో విజేతల ఎంపిక

3 ప్రధాన బహుమతులతోపాటు వంద కన్సొలేషన్ గిఫ్టులు

మోటార్ బైక్, రిఫ్రిజిరేటర్, టీవీ తదితర బహుమతులు

సమయం : గురువారం సాయంత్రం 4 గంటలకు

వేదిక : పాలచర్లలోని ఆంధ్రజ్యోతి ప్రధాన కార్యాలయం



పాఠకులు ఎప్పుడెప్పుడా అని ఆత్రుతగా ఎదురుచూస్తున్న 'ఆంధ్రజ్యోతి లక్కీడ్రా' గురువారం జరగనుంది. రాజమహేంద్రవరం సమీపంలోని దివాన్‌చెరువు-వెలుగుబంద రోడ్‌లోని పాలచర్లలో ఆంధ్రజ్యోతి యూనిట్ కార్యాలయం వేదికగా 'కార్ అండ్ బైక్ రేస్'లో అదృష్ట పాఠకులు ఎవరన్నది సాయంత్రం 4 గంటలకు తేలనుంది. పాఠకుల నుంచి వచ్చిన వేలాది కూపన్లలో విజేతలను ఎంపిక చేయనున్నారు. ప్రథమ బహుమతి కింద మోటార్ బైక్, రెండో బహుమతి రిఫ్రిజిరేటర్, మూడో బహుమతి టీవీని విజేతలకు అందజేయనున్నారు. అలాగే మరో 100 కన్సొలేషన్ బహుమతుల కింద ఒక్కొక్కరికి రూ.2వేలు విలువచేసే గృహోపకరణాలను అందజేయనున్నారు. 'ఆంధ్రజ్యోతి' 22వ వార్షికోత్సవం సందర్భంగా పాఠకులకు రూ.కోటి విలువైన బహుమతులను అందజేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే.



పుష్కరాలపై ఫోకస్



సమావేశంలో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు.. సమీక్షలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ప్రశాంతి



- పుష్కరాలకు ఇద్దరు ప్రత్యేక అధికారులు
- హేవలాక్ బ్రిడ్జి పర్యాటకంగా అభివృద్ధికి రైల్వేకి రూ.12.50 కోట్లు చెల్లించాం
- తలసరి ఆదాయం పెరుగుదలపై దృష్టి పెట్టండి
- సీఎం చంద్రబాబు స్పష్టీకరణ
- జిల్లా భవిష్యత్ కార్యాచరణపై ప్రజంటేషన్ ఇచ్చిన కలెక్టర్

రాజమహేంద్రవరం, మార్చి 26(ఆంధ్రజ్యోతి): రానున్న గోదావరి పుష్కరాలకు ఇప్పటినుంచే తగిన ముందస్తు ఏర్పాట్ల పర్యవేక్షణకు ఇద్దరు ఐఏఎస్ అధికారులు వీరపాండ్యన్, వి.విజయరామరాజులను ప్రత్యేక అధికారులుగా నియమిస్తున్నామని సీఎం చంద్రబాబునాయుడు కలెక్టర్ల సమావేశంలో పేర్కొన్నారు. రాజమహేంద్రవరంలో ఐదు వేల హోటల్ రూములు అందుబాటులో ఉండాల్సిన అవసరం ఉందన్నారు. తగిన భూమిని గుర్తించి అందుబాటులో ఉంచుకుంటే హోటళ్ల నిర్మాణానికి ముందుకు వచ్చేవారితో మాట్లాతామని చంద్రబాబు చెప్పారు. అమరాతిలో రెండు రోజులపాటు జరిగి బుధవారం ముగిసిన కలెక్టర్ల సమీక్షలో ఆయన మాట్లాడారు. రాజమహేంద్రవరంలో హేవలాక్ బ్రిడ్జి, పిచ్చుకలంక, కడియం నర్సరీలు, పోలవరాన్ని కలుపుతూ ఒక పర్యాటక సర్క్యూట్ అభివృద్ధి చేయాలని ఆదేశించారు. హేవలాక్ బ్రిడ్జిని పర్యాటకంగా అభివృద్ధి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే రైల్వే శాఖకు రూ.12.50 కోట్లు చెల్లించిందని సీఎం తెలిపారు. ఆ దిశగా కేంద్రం నుంచి నిధులు రాబట్టడానికి కృషి చేయాలని ఆదేశించారు. ఒకప్పుడు దేశానికే అన్నపూర్ణగా పేరుగాంచిన గోదావరి జిల్లాల్లో రానురాను తలసరి ఆదాయం తగ్గుతోందన్నారు. దీనిపై కలెక్టర్లు ప్రత్యేకంగా దృష్టిసారించాలని సూచించారు. వరిగడ్డితో బయో ఇంధనం తయారీ యూనిట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు.

మా కార్యాచరణ ఇదీ : కలెక్టర్

కలెక్టర్లతో సీఎం చంద్రబాబు సమావేశంలో భాగంగా తూర్పుగోదావరిలో కార్యాచరణ ప్రణాళికను కలెక్టర్ పి.ప్రశాంతి వివరించారు. జిల్లాలో 77820 హెక్టార్లలో పంట లక్ష్యం కాగా 4970 హెక్టార్లలో ఉద్యాన పంటను ప్రోత్సహించనున్నామన్నారు. జిల్లాలో 12-15% వరకూ పాలు, మాంసం, గుడ్ల వృద్ధి రేటు, మత్స్యసంపదను 2వేల హెక్టార్లలో అదనంగా పెంచడాన్ని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. పారిశ్రామికవృద్ధిలో భాగంగా ప్రతి నియోజకవర్గంలోనూ ఎంఎస్ఎంఈ పార్కులను, నానో ఎంఎస్ఎంఈ పార్కులను ఏర్పాటు చేస్తామన్నారు. కల్వచర్లలో జియో బయో ఫ్యూయల్ ఇండస్ట్రీని ప్రారంభిస్తానమ్నారు. పీఎం సూర్యఘర్ పథకంలో భాగంగా 7500 కిలోవాట్ల సామర్థ్యంతో 2500 ఇళ్లపై రూఫ్‌టాప్ ఏర్పాటు చేయనున్నామని ఆమె వివరించారు. 160 కిలోమీటర్లమేర సీసీ, బీటీ రోడ్లను రూ.85 కోట్ల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో నిర్మిస్తామని చెప్పారు. నిడదవోలులో రూ.184.74 కోట్లతో ఆర్వోబీ, రాజాగనగరం నుంచి సామర్లకోట వరకూ రూ.298కోట్లతో ఏడీబీ రోడ్డును అభివృద్ధి చేస్తున్నామన్నారు. జిల్లాలో 10 ఆర్వోబీలను నిర్మించనున్నామని పేర్కొన్నారు. 10 వేల 784 ఇళ్ల నిర్మాణాన్ని లక్ష్యంగా నిర్ణయించుకున్నామని చెప్పారు. అక్టోబరులో అంతర్జాతీయ పుష్ప ప్రదర్శనను కడియంలో నిర్వహిస్తామన్నారు. బొమ్మూరు వద్ద ఎస్‌సీడీసీ పథకంలో ప్రపంచంలోనే పెద్దదైన గ్రెయిన్ స్టోరేజీ అండ్ ప్రాసెసింగ్ యూనిట్‌ని ప్రతిపాదిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాల, ప్రభుత్వాస్పత్రి వద్ద 4జీ సాచురేషన్ ప్రాజెక్టులను నెలకొల్పుతామని, కొవ్వూరు ప్రభుత్వాస్పత్రిని 50 నుంచి 150 పడకల ఆస్పత్రిగా అభివృద్ధి చేయనున్నామని తదితర అంశాలను ప్రజంటేషన్ ద్వారా కలెక్టర్ ప్రశాంతి వివరించారు.

నేడు బిక్కవోలు ఎంపీపీ సహా 11 ఉపసర్పంచ్ పదవులకు ఎన్నికలు

- ఏర్పాట్లు పూర్తి
- ఉండ్రాజవరం ఉపసర్పంచ్ ఎన్నిక వాయిదా

రాజమహేంద్రవరం మార్చి26(ఆంధ్రజ్యోతి):జిల్లాలో పలు ఉపసర్పంచ్‌లు, బిక్కవోలు ఎంపీపీ ఎన్నిక గురువారం జరుగనున్నది. దీనికి సంబంధించి ఎన్నికల అధికారులు ఏర్పాట్లు సిద్ధం చేశారు. తెలుగుదేశం కూటమి ఎక్కువ స్థానాలు దక్కించుకునే ప్రయత్నం చేస్తోంది. కూటమికే అనుకూల పరిస్థితులు కనిపిస్తున్నాయి. జిల్లాలో మొత్తం 12 ఉపసర్పంచ్ పదవులకు, బిక్కవోలు ఎంపీపీ పదవికి, మరో రెండు కోఆప్షన్ సభ్యులకు ఎన్నిక జరగాల్సి ఉంది. ఉండ్రాజవరం గ్రామంలో ఇటీవల ఒక వార్డు మెంబరు చనిపోవడంతో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు గురువారం జరగాల్సిన ఉండ్రాజవరం ఎన్నిక వాయిదా పడింది. ఇక బిక్కవోలు ఎంపీపీ ఎన్నికకు రంగం సిద్ధమైంది. గతంలో వైసీపీ ఎంపీపీ ఇక్కడ రాజీనామా చేశారు. మొత్తం 20 మంది వైసీపీ ఎంపీటీసీలు ఉండగా, అందులో ఆరుగురు ఇప్పటికే టీడీపీలోకి చేరారు. మరో ఆరుగురు చేరడానికి సిద్ధంగా ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. ఈనేపథ్యంలో ఈ ఎంపీపీ పదవి కూటమికి దక్కే అవకాశం కనిపిస్తోంది. కానీ ఇక్కడ వైసీపీ ఒక అభ్యర్థిని ప్రకటించింది. కూటమి తరపున తొస్సిపూడి ఎంపీటీసీ సుమ పేరు పరిశీలనలో ఉన్నట్టు సమాచారం. ఇక గోకవరం మండలంలో మల్లేశ్వరం, కొవ్వూరు మండలంలో పెనకనమెట్ట, రాజానగరం మండలంలో పాతతుంగపాడు, గోపాలపురం మండలంలో కోవ్వూరుపాడు, వెంకటాయపాలెం, తాళ్లపూడి మండలంలో తాడిపూడి, అనపర్తిలో మండలంలో లక్ష్మీనరసాపురం, రంగంపేట మండలంలో మర్రిపూడి, కడియం మండలంలో మురమండ, సీతానగరం మండలంలో మునికూడలి ఉపసర్పంచ్ పదవులకు ఎన్నికలు జరగనున్నాయి. వాటితోపాటు పెరవలి, రంగంపేట మండల కోఆప్షన్ సభ్యుల ఎన్నికలు జరుగనున్నాయి. వీటిలో చాలావరకు కూటమికి దక్కే అవకాశం ఉంది. కొన్ని ఏకగ్రీవం అయ్యే చాన్స్ ఉంది.

ఉద్రిక్తత.. ఉత్కంఠ!





ఆందోళనకారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, ఎస్పీ నరసింహ కిషోర్



రాజమహేంద్రవరం ప్రభుత్వ బోధనాసుపత్రి మార్చురీ నుంచి మృతదేహాన్ని తరలిస్తున్న దృశ్యం



ప్రభుత్వ బోధనాసుపత్రి వద్ద నిరసనలు

ప్రభుత్వ బోధనాసుపత్రి వద్ద ఆందోళనకారులను చెదరగొడుతున్న పోలీసులు

- పాస్టర్ ప్రవీణ్ మృతిపై ఆందోళన
- రోడ్డు ప్రమాదం కాదు.. హత్యేనంటూ నిరసనలు
- రాజమహేంద్రి ప్రభుత్వాసుపత్రి వద్ద ఉద్రిక్తత
- భారీ సంఖ్యలో తరలి వచ్చిన అనుచరులు
- ఆస్పత్రి వద్ద కేఏ పాల్, మాజీ ఎంపీ హర్షకుమార్
- భారీ సంఖ్యలో మోహరించిన పోలీసులు
- ప్రవీణ్ మృతదేహం హైదరాబాద్ తరలింపు
- దర్యాప్తు వేగవంతం : ఎస్పీ నరసింహ కిశోర్
- అనుమానాస్పద మృతిగా కేసు నమోదు

- మెయిన్/జిల్లాలో..

ఇన్‌పుట్ సబ్సిడీ విడుదలకు లైన్ క్లియర్

సీఎంకి కృతజ్ఞతలు తెలిపిన దుర్గేష్



నిడదవోలు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): నిడదవోలులో ఎర్రకాలువ ముంపు వల్ల నష్టపోయిన రైతాంగానికి ఇన్‌పుట్ సబ్సిడీ విడుదలకు లైన్‌క్లియర్ అయినట్టు రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖా మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. బుధవారం ఈమేరకు ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. వెలగపూడి సెక్రటేరియట్‌లో బుధవారం రెండో రోజు జరుగుతున్న కలెక్టర్ల సదస్సులో ఎర్రకాలువ ముంపు బాధితుల ఇన్‌పుట్ సబ్సిడీ విడుదలకు సంబంధించిన అంశాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకువెళ్లినట్టు మంత్రి దుర్గేష్ తెలిపారు. దీనిపై తక్షణం స్పందించిన చంద్రబాబునాయుడు ఆర్థిక శాఖలో సంబంధిత అధికార్లతో మాట్లాడి ఇన్‌పుట్ సబ్సిడీ సమస్యకు చెక్ పెట్టారన్నారు. 2024 జూలై నెలలో సంభవించిన భారీ వర్షాలకు నష్టపోయిన రైతాంగానికి ఇప్పటికే ఇన్‌పుట్ సబ్సిడీపై ప్రకటన చేశామని, ఈ సమస్యకు పరిష్కారం చూపిన చంద్రబాబుకి కృతజ్ఞతలు తెలిపారు.





పుస్తకాల బరువు తగ్గింది!

- పుస్తకాలు వచ్చేస్తున్నాయి
- ఒకే పుస్తకంలో తెలుగు-ఇంగ్లీషు..మ్యాథ్స్ పాఠాలు
- రెండు సెమ్‌లు.. రెండు దఫాల పుస్తకాల పంపిణీ
- జిల్లాకు సుమారు 35లక్షల పాఠ్యపుస్తకాలు అవసరం
- ఇప్పటికే 4,83, 909 రాక
- ప్రభుత్వ పాఠ్యపుస్తకాల జిల్లా మేనేజర్ సురేష్

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

తెలుగుదేశం కూటమి ప్రభుత్వం విద్యార్థుల పుస్తకాల మోత బరువు తగ్గింది. కొన్ని పుస్తకాలను కలిపి ఒకే పుస్తకంగా ముద్రించారు. ఈ కూటమి ఈ పుస్తకంలోని పాఠాలను రెండుగా విభజించి.. రెండు పుస్తకాలుగా ముద్రించారు. సెమిస్టర్ విధానంలో పరీక్షలు ఉంటున్న సంగతి తెలిసిందే. గతంలో విద్యా సంవత్సరంలో మూడు సెమ్‌లు ఉండాలి. వాటిని రెండుకు కుదించారు. ఈ నేపథ్యంలో పాఠ్య పుస్తకాలను మొదటి సెమ్‌కు పాఠశాలలు తెరవక ముందే పంపిణీ చేస్తారు. మరో ఆరు నెలలకు మొదలైతే రెండో సెమ్‌కు కొంత ముందుగానే పుస్తకాలు పంపిణీ చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రస్తుతం మొదటి సెమ్ పుస్తకాలు వచ్చేశాయి. జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు సుమారు 35 లక్షల వరకూ పుస్తకాలు అవసరం ఉంది. ఇప్పటికే 4,83,909 పాఠ్య పుస్తకాలు వచ్చా యని ప్రభుత్వ పాఠ్యపుస్తకాల జిల్లా మేనేజర్ పి.సురేష్ తెలిపారు. మొదటి సెమ్‌కు అవసరమైన పుస్తకాలు వచ్చేనెలలో పూర్తిగా వస్తాయనిచెప్పారు.

మూడు పుస్తకాలు.. ఇక పుస్తకమే

ఒకటవ తరగతి నుంచి 2వ తరగతి వరకూ తెలుగు, ఇంగ్లీషు, మాథ్స్ పుస్తకాలు ఇక వేర్వేరుగా ఉండవు. ఈ మూడింటిని ఒకే పుస్త కంగా తీసుకొచ్చారు. మొదటి సెమ్‌కు అవసరమైన పుస్తకాలు, ముందుగానే, రెండో సెమ్‌కు అవసరమైన పుస్తకాలను వేర్వేరుగా ముద్రించడంవల్ల పుస్తకాల సైజ్ కూడా తగ్గింది. దీంతో పిల్లలకు బరువు తగ్గింది. ఇక 3వ తరగతి నుంచి 5వ తరగతి వరకూ తెలుగు, ఇంగ్లీషు పుస్తకాలను ఒకటిగా కలిపేశారు. మాథ్స్ ఎన్విరాన్‌మెంట్ల వంటి మరో పుస్తకంగానూ ముద్రిస్తున్నారు. ఇలా 1వ తరగతి నుంచి 9వ తరగతి వరకూ పుస్తకాలను కలిపి ముద్రిస్తున్నారు. ఈ పరిస్థితి వల్ల పుస్తకాల సంఖ్య కూడా బాగా తగ్గడం గమనార్హం. గతంలో మొత్తం 1నుంచి పదవతరగతి వరకూ విద్యార్థికి 112 పుస్తకాలు ఉండేవి. ఇవాళ వాటి సంఖ్య 80కు తగ్గింది. ప్రస్తుతం సెమ్-1కు 46, సెమ్-2కు 34 పుస్తకాలు మాత్రమే అమలు చేస్తున్నారు. గతంలో 1, 2వ తరగతి ఒక్కింటికి 8 పుస్తకాలు వంతున ఉండేవి. ప్రస్తుతం అవి నాలుగు మాత్రమే. మూడు నుంచి 5వ తరగతి వరకూ 12వంతున ఉండేవి. ప్రస్తుతం 8 మాత్రమే ఉన్నాయి. ఆరు, ఏడు తరగతులకు 9 వంతున ఉండేవి ప్రస్తుతం 8 మాత్రమే. 8వ తరగతికి 13 పుస్తకాలు ఉండేవి. ఇవాళ వాటి సంఖ్య 8 మాత్రమే. 9వ తరగతికి 16 ఉండేవి. వాటి సంఖ్య ఇవాళ 9 మాత్రమే. పదో తరగతికి మాత్రం గతంలో 13 ఉండేవి. ప్రస్తుతం కూడా 13గానే ఉన్నాయి.



ప్రభుత్వ పాఠ్యపుస్తకాల జిల్లా మేనేజర్ సురేష్

బలభద్రపురంలో హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఉమామహేశ్వరరావు

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఉమామహేశ్వరరావు

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం బలభద్రపురంలో తక్షణమే హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించి, ప్రజారోగ్యాన్ని రక్షించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బలభద్రపురంలో సీపీఎం బృందం పర్యటించిందని, ఈ సందర్భంగా అక్కడి ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను తమ దృష్టికి తీసుకువచ్చారని చెప్పారు. వారం రోజుల్లో కేన్సర్‌తో ఇద్దరు మరణించారన్నారు. వైద్యఆరోగ్యశాఖ అక్కడ నిర్వహించిన సర్వే సమగ్రంగా లేదన్నారు. బలభద్రపురంతోపాటు సింగంపల్లి, నల్లమిల్లి, బాలవరం, దొంతమూరు, కాపవరం గ్రామాల్లో సుమారు 50 వేల మంది జనాభా ఉన్నారని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన వైద్యశిబిరంలో గడచిన రెండు రోజుల్లో ఓపి 260కి మించలేదన్నారు. గత రెండేళ్లలో బలభద్రపురంలో కేన్సర్‌తో 25 మంది మృతి చెందినట్టు సర్పంచ్ రామారావు ఆ జాబితాను ప్రకటించారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా స్పందించాల్సిన అవసరం ఉందన్నారు. గ్రాసిం పరిశ్రమ వ్యర్థాల విడుదల, కాలుష్య తీవ్రతపై కాలుష్య నియంత్రణ మండలితోపాటు, పర్యావరణ నిపుణులతో పరిసర గ్రామాల్లో గాలి, నీరు, నేల కాలుష్య నియంత్రణపై స్పష్టత ఇవ్వాలని ఆయన కోరారు. పరిశ్రమల నిబంధనలను యాజమాన్యాలు యథేచ్ఛగా ఉల్లంఘిస్తున్నాయని, అటువంటి వాటిపై కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శి టి.అరుణ్ మాట్లాడుతూ ఫార్మసీ విద్యార్థిని అంజలి ఘటనపై బొల్లినేని యాజమాన్యం స్పందించాలని, నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే పాస్టర్ ప్రవీణ్ మృతి ఘటన దారుణమని, గతంలో తనకు ప్రాణహాని ఉందని ప్రవీణ్ ప్రకటించిన విషయాన్ని గుర్తుచేశారు. దీనిపై సమగ్ర విచారణ జరపాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. సమావేశంలో నాయకులు జువ్వల రాంబాబు, బి.పవన్ పాల్గొన్నారు.

వైభవంగా వెంకన్నస్వామి కల్యాణం


స్వామివారి కల్యాణాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

కొవ్వూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) :పట్టణంలోని బసివిరెడ్డిపేటలో వేంచేసియున్న శ్రీరాజ్య లక్ష్మీ గోదా సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి కల్యాణం బుధవారం వైభవంగా జరిగింది. వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉదయం ఆలయ అర్చకుడు గొడవర్తి వేణుగోపాలచార్యుల పర్యవేక్షణలో మూల మంత్ర హోమం, హయగ్రీవ ఇష్టియా గము, నిత్య పూర్ణాహుతి, తీర్థప్రసాద వితరణ చేశారు. రాత్రి ఆలయ కమి టీ చైర్మన్ దేవగుప్తాపు లక్ష్మణరావు దంపతులు పీటాలపై కూర్చుని స్వామివారి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. శ్రీరాజ్యలక్ష్మీ గోదాసమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి వార్లను విశేష అలంకరణ చేసి పూజలు గావించారు. కార్యక్రమంలో వేద పండితులు, పట్టణ పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధికసంఖ్యలో పాల్గొని శ్రీవారి కల్యాణ మహోత్సవాన్ని తిలకించారు.

రైతు రిజిస్ట్రేషన్ ఐడీ ప్రక్రియ పరిశీలన


గోపవరంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న తహశీల్దార్

నిడదవోలు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): రైతులకు ప్రభుత్వ ప్రయోజనాలు కల్పించేలా కేంద్రప్రభుత్వం తీసుకొచ్చిన రైతు రిజిస్ట్రేషన్ సంఖ్య తప్పనిసరిని తహశీల్దార్ బి.నాగ రాజు నాయక్, మండల వ్యవసాయశాఖాధి కారి జి.సత్యనారాయణ అన్నారు. బుధవారం మండలంలో జరగుతున్న రైతు రిజిస్ట్రేషన్ ఐడీ ప్రక్రియను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారిద్దరు మాట్లాడుతూ సొంత వ్యవసాయ పొలం కలిగిన రైతులు రిజిస్ట్రేషన్ ఐడీ పొందాలన్నారు. దీనిద్వారా అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్, పంట నష్టపరిహారం, పంటల బీమా వంటి తదితర రాయితీలు పొందేందుకు అర్హత ఉంటుందన్నారు.

'ఉపాధి హామీ పనులకు ప్రణాళిక తయారు చేయండి'

తాళ్లపూడి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): రానున్న ఏప్రిల్, మే, జూన్ నెలల్లో చేపట్టబోయే ఉపాధి హామీ పథకం పనుల కోసం ప్రణాళిక తయారుచేయాలని ఎంపీడీవో వెంకటరమణ ఆదేశించారు. ఈమేరకు ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బందితో బుధవారం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం ఎంపీడీవో మాట్లాడుతూ ప్రతి కూలీకి కనీస సగటు వేతనం రూ. 290 వచ్చేవిధంగా పనులు గుర్తించాలన్నారు. వాటిలో పశువుల నీటి తొట్టెల నిర్మాణం, ఫారం పాండ్స్ నిర్మాణం, పంట కాలువల్లో పూడికతీత, సాగునీటి చెరువుల్లో పూడికతీత పనులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఆర్‌జీఎస్ ఏపీవో రమాదేవి, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

చోరీకి పాల్పడ్డాడు.. భయపడి పొట్టలో పొడుచుకున్నాడు

కొవ్వూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): దొంగతనం చేస్తూ దొరికిపోయిన వ్యక్తి జనం కొడతారనే భయంతో కత్తెరతో పొట్టలో పొడుచుకున్న సంఘటన కొవ్వూరు పట్టణంలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు అందించిన వివరాలివి... గోష్పాదక్షేత్రంలోని ప్రధాన స్నానఘట్టంలో ఇద్దరు అన్నదమ్ములు నదిలో స్నానమాచరిస్తున్నారు. వారికి సంబంధించి రెండు సెల్‌ఫోన్లను (యాపిల్ 6ఎస్, అప్పో ఎఫ్ 21) బలభద్రపురం మండలం బిక్కవోలుకి చెందిన పల్లా పోలయ్య చోరీ చేశాడు. దీన్ని స్థానికులు గమనించి పోలయ్యను పట్టుకోవడంతో తనతో పాటు తెచ్చుకున్న చిన్న కత్తెరతో పొట్టలో పొడుచుకున్నాడు. గాయం కావడంతో కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. నల్లా ప్రశాంతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ కె. జగన్మోహనరావు తెలిపారు.

నేడు ఉప సర్పంచ్ ఎన్నిక

గోపాలపురం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): గోపాలపురం, కొవ్వూరుపాడు, వెంకటాపాలెం పంచాయతీల్లో గురువారం ఉదయం 11 గంటలకు ఉపసర్పంచ్ ఎన్నిక జరగనుంది. గోపాలపురంలో 16వ వార్డు మెంబర్లకు ఎంపీడీఓ కార్యాలయం నుంచి ఇప్పటికే సమాచారం అందించారు. గోపాలపురంలో జరిగే ఎన్నికకు నల్లజర్ల ఈవోపీఆర్‌డీ సింహాద్రిరావు ఎన్నికల అధికారిగా వ్యవహరిస్తారు. అలాగే కొవ్వూరుపాడులో జరిగే ఎన్నికకు 10 మంది వార్డు మెంబర్లు హాజరుకావాల్సి ఉంది. అక్కడ ఎన్నికల అధికారిగా గోపాలపురం ఈఓపీఆర్‌డీ బీఎస్ఎస్ శ్రీనివాసరావు వ్యవహరిస్తారు. వీరితో పాటు వెంకటాయపాలెంలో 12 వార్డు మెంబర్లు ఉప సర్పంచ్‌ను ఎన్నుకుంటారు. దేవరపల్లి ఈఓపీఆర్‌డీ రాజారావు ఎన్నికల అధికారిగా వ్యవహరించనున్నారు.

నేడు తాళ్లపూడిలో తాగునీటి సరఫరా బంద్

తాళ్లపూడి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం మండలంలో అన్నిగ్రామాల్లో గల వాటర్‌ట్యాంకులు శుభ్రపరిచే పనుల్లో భాగంగా ఉదయం పది గంటల నుంచి సాయంత్రం ఐదుగంటల వరకు తాగునీటి సరఫరా ఉండదని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సూర్జహాన్ ఒక ప్రకటనలో తెలిపారు.

50 శాతం వడ్డీ రాయితీ

● 31వ తేదీలోపు ఇంటిపన్నులు, ఖాళీస్థలం పన్నులు చెల్లిస్తే .. ● ప్రకటించిన కమిషనర్ నాగేంద్రకుమార్


మాట్లాడుతున్న కమిషనర్ నాగేంద్రకుమార్

కొవ్వూరు, మార్చి26 (ఆంధ్రజ్యోతి): ఈనెల 31వ తేదీలోపు ఇంటిపన్నులు, ఖాళీస్థలం పన్నులు చెల్లించినవారికి 50 శాతం వడ్డీ రాయితీ ఇస్తున్నట్టు మున్సిపల్ కమిషనర్ టీ. నాగేంద్రకుమార్ ప్రకటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ 2024- 25 సంవత్సరానికి సంబంధించి బకాయిపడ్డ ఆస్తి పన్నులు, ఖాళీస్థలాల పన్నులు ఏకమొత్తంలో చెల్లించిన వారికి ఆస్తిపన్నుపై 50 శాతం వడ్డీ రాయితీ కల్పిస్తూ ప్రభుత్వం జీవో విడుదల చేసిందని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇప్పటికే ఆస్తి పన్నులు వడ్డీలతో సహా చెల్లించిన వారికి, వారు వడ్డీ రూపంలో చెల్లించిన మొత్తంలో 50 శాతం రాయితీ సొమ్మును భవిష్యత్‌లో వారు చెల్లించాల్సిన ఆస్తిపన్నులో సర్దుబాటు చేయడం జరుగుతుందన్నారు. ఇంకా పన్నులు చెల్లించాల్సినవారు మున్సిపల్ కార్యాలయం, మీసేవ, సచివాలయాల్లో పన్నులు చెల్లించి మున్సిపాల్టీ అభివృద్ధికి సహకరించాలన్నారు. కొవ్వూరు మున్సిపాల్టీలో 2024-25 సంవత్సరానికి గాను రూ. 4.43 కోట్లు ఆస్తిపన్ను డిమాండ్ కాగా ఇప్పటివరకు రూ. 3.63 కోట్లు వసూలుచేయగా రూ.80 లక్షలు వసూలు చేయాల్సి ఉందన్నారు. ఖాళీస్థలాల పన్నులు రూ. 92.30 లక్షలు డిమాండ్ కాగా రూ. 26.60 లక్షలు వసూలు చేయగా, రూ. 65.70 లక్షలు వసూలు చేయా ల్సి ఉందన్నారు. కుళాయి పన్నులు రూ. 1.34 కోట్లు డిమాండ్ కాగా, రూ. 54 లక్షలు వసూలు చేయగా, రూ. 80 లక్షలు వసూలు చేయాల్సి ఉందన్నారు.

వాహన పార్కింగ్ ఫీజుల క్రమబద్ధీకరణ

మల్టీప్లెక్స్‌లు, మాల్‌ల్లో వాహన పార్కింగ్ రుసుములను రాష్ట్రప్రభుత్వం క్రమబద్ధీరించిందని మున్సిపల్ కమిషనర్ టి. నాగేంద్రకుమార్ తెలిపారు. ఇష్టానుసారంగా రుసుములు వసూలు చేయకుండా కట్టడి చేస్తూ ఈ నిర్ణయం తీసుకుందన్నారు. ఏప్రిల్ 1 నుంచి కొత్త నిబంధనలు అమల్లోకి వస్తాయన్నారు. మొదటి 30 నిమిషాల వరకు పార్కింగ్ ఫీజు పూర్తిగా ఉచితమన్నారు. 30 నిమిషాల నుంచి గంట వరకు పార్కింగ్ చేసిన వ్యక్తులు మల్టీప్లెక్స్‌లు, మాల్‌ల్లో ఏదైనా వస్తువులు కొనుగోలు చేసిన బిల్లులు చూపిస్తే రుసుములు వర్తించవన్నారు. గంటకు పైగా పార్కింగ్ చేసినవారు సినిమా టికెట్, ఇతరత్రా బిల్లులు చూపినట్టయితే ఉచితం. ఎటువంటి బిల్లులు చూపని వారినుంచి పార్కింగ్ రుసుములు వసూలు చేయవచ్చునని కమిషనర్ తెలిపారు.

శాసనసభ కమిటీ ఆన్ ఎథిక్స్ సభ్యుడిగా ఎమ్మెల్యే ముప్పిడి

కొవ్వూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర శాసనసభ కమిటీ ఆన్ ఎథిక్స్ కమిటీ సభ్యుడిగా కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు నియమితులయ్యారు. బుధవారం వెలగపూడిలో జరిగిన శాసనసభ కమిటీల ప్రాథమిక సమావేశంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ శాసనసభ కమిటీల్లో ఒకటైన ఆన్ ఎథిక్స్‌లో సభ్యుడిగా నియమించడంపై స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం కొణిదల పవన్‌కల్యాణ్, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్గానిక్ ఆకుకూరల పంపిణీ


ఆకుకూరలు అందిస్తున్న వేదకుమారి

తాళ్లపూడి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం ఆదేశాల మేరకు పెద్దేవం అంగన్‌వాడీ కేంద్రంలోని గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు బుధవారం ఆర్గానిక్ ఆకుకూరలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది పీహెచ్ వేదకుమారి, టీడీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు తిగిరిపల్లి గోపి, హనుమంతు, రాజేష్, అంగన్‌వాడీ సిబ్బంది భాస్కరం, కుమారి, దయామణి పాల్గొన్నారు.

నెలాఖరులోగా రైతు రిజిస్ట్రీ చేయించుకోవాలి

కొవ్వూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతులంతా ఈనెలాఖరులోగా ఫార్మర్ రిజిస్ట్రీ చేయించుకోవాలని వ్యవసాయాధికారి ఏ. గంగాధర్ తెలిపారు. దీన్ని చేయించుకోవడం వల్ల కేంద్రప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాలు రైతులకి అందుతాయన్నారు. రిజిస్ట్రీ చేయించుకున్న వారికి మేసేజ్ ద్వారా యూనిక్ ఐడీ వస్తుందన్నారు.

బాలిక అదృశ్యంపై కేసు

గోపాలపురం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మైనర్ అదృశ్యంపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ కే.సతీశ్‌కుమార్ బుధవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాలివి.. రాజంపాలెంకి చెందిన 16సంవత్సరాల బాలిక ఈ నెల 26వ తేదీ ఉదయం 5.30 నిమిషాల సమయంలో ఇంటి నుంచి తల్లిదండ్రులకు చెప్పకుండా బయటకు వెళ్లి, తిరిగి రాలేదు. దీంతో తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు. ఆచూకీ తెలిసినవారు ఈ కింది ఫోన్‌నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు. వివరాలకు 9440796665 ను సంప్రదించాలన్నారు.

మద్యం మత్తులోనే అంబేడ్కర్ విగ్రహానికి చెప్పుల దండ వేశాడు

● సీఐ రాంబాబు వెల్లడి


అంబేడ్కర్, ఎన్టీఆర్ విగ్రహాలకు చెప్పుల దండ వేసిన బాబ్జీ

నల్లజర్ల, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): దూబచర్ల గాంధీ కాలనీలో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి, ముసుళ్లకుంటలో ఎన్టీఆర్ విగ్రహాలకు చెప్పుల దండ వేసిన నిందితుడు పుల్లలపాడుకు చెందిన వైసీపీ నేత బుడుపుల బాబ్జీ మద్యం మత్తులో ఉండటం వల్లే వేశాడని సీఐ రాంబాబు వెల్లడించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైసీపీలో తొందరగా గుర్తింపు రావాలనే ఉద్దేశంతో ఈనెల 21వ తేదీ అర్ధరాత్రి ఫుల్‌గా మద్యం సేవించి రెండు విగ్రహాలకు చెప్పుల దండ వేసినట్టు పేర్కొన్నారు. నిందితుడిపై 2024 మేలో హత్యాయత్నం కేసు, జూన్‌లో ఆయుధంతో దాడి చేసిన కేసు నమోదు అయ్యి ప్రస్తుతం బెయిల్‌పై ఉన్నట్టు తెలిపారు.

టీడీపీ కార్యకర్తకు ప్రమాద బీమా చెక్కు అందజేత


చెక్కును అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే శేషారావు

ఉండ్రాజవరం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): వడ్లూరుకి చెందిన టీడీపీ కార్యకర్త రాపాక రమేష్‌కు పార్టీ తరఫున ప్రమాద బీమా రూ.5లక్షలు మంజూరైనట్టు మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి బూరుగుపల్లి శేషారావు తెలిపారు. ఈ మేరకు చెక్కును బుధవారం రమేష్ కుటుంబసభ్యులకు అందజేశారు. పార్టీ సభ్యత్వం ద్వారా వచ్చిన బీమా వర్తించిందని శేషారావు చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు సింహాద్రి రామకృష్ణ, వడ్లూరుగ్రామ టీడీపీ అధ్యక్షుడు పి. వెంకటేశ్వరరాజు, బూత్ ఇన్‌ఛార్జి వి. రెడ్డి, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

నేటి ఉండ్రాజవరం ఉప సర్పంచ్ ఎన్నిక వాయిదా : ఈవోపీఆర్డీ

ఉండ్రాజవరం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ఈనెల 27 జరగాల్సిన ఉండ్రాజవరం గ్రామ ఉప సర్పంచ్ ఎన్నిక వాయిదా పడినట్టు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఈవోపీఆర్డీ కె. ఆంజనేయశర్మ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పంచాయతీ 3వ వార్డు సభ్యురాలు బూరుగుపల్లి సత్యవతి అక్టోబరు 22వ తేదీ 2023 సంవత్సరంలో మరణించించడంతో ఖాళీ ఏర్పడింది. ఈ క్రమంలో పంచాయతీరాజ్ ఎన్నికల నియమావళిననుసరించి, ఎన్నికల కమిషన్ సూచన మేరకు జిల్లా పంచాయతీ అధికారి ఆదేశాల మేరకు వాయిదాపడినట్టు ఆయన తెలిపారు. ఈ ఏడాది జనవరిలో ఉపసర్పంచ్ పదవికి 5వ వార్డు సభ్యుడు సింహాద్రి రామకృష్ణ రాజీనామా చేయడంతో ఎన్నిక జరగాల్సి ఉందని, వార్డు సభ్యురాలు మరణించడంతో ఎన్నిక వాయిదాపడినట్టు ఎన్నికల ఆర్‌వో ఆంజనేయశర్మ చెప్పారు.

పదోతరగతి పరీక్షకు 23 మంది గైర్హాజరు

కొవ్వూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు పట్టణం, మండలంలో బుధవారం జరిగిన పదో తరగతి ఫిజిక్స్ పరీక్షకు 23 మంది గైర్హాజరయ్యారు. మొత్తం 10 పరీక్షా కేంద్రాలలో 1275 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా, 1252 మంది మాత్రమే హాజరయ్యారు. అలాగే కొవ్వూరు మున్సిపల్ హైస్కూల్‌లో 76 కి 70, ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో (గవర్నమెంట్ హైస్కూల్) 134 కి 132, ఏఎన్‌జడ్‌పీ గర్ల్స్ హైస్కూల్లో 109 కి 108, డా. సర్వేపల్లి రాధాకృష్ణ హైస్కూల్లో 95 కి 93, అభ్యాస పాఠశాలలో 130 కి 130, వేములూరు దీప్తి హైస్కూల్లో 148 మందికి 143, భాష్యం పాఠశాలలో 144 కి 139, జడ్పీహెచ్ఎస్, కుమారదేవంలో 118 కి 118, జడ్పీహెచ్ఎస్, వాడపల్లిలో 213 కి 212, జడ్పీహెచ్ఎస్‌లో (పంగిడి) 108 కి 107 మంది విద్యార్థులు హాజరయ్యారు.

దేవరపల్లి: మండలంలో బుధవారం జరిగిన 10వ తరగతి ఫిజిక్స్ పరీక్షకు 1010 మంది విద్యార్థులు హాజరయ్యారు. 30 మంది గైర్హాజరయ్యారు. వీరిలో రెగ్యులర్ విద్యార్థులు 998 మంది పరీక్ష రాసినట్టు ఎంఈవోలు తిరుమలదాసు, వీవీ అప్పారావు తెలిపారు.

నవధాన్యాలు పండించాలి

చాగల్లు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): భూసారాన్ని పెంచుకోవడానికి రైతులు పచ్చిరొట్ట ఎరువు మాదిరిగానే నవధాన్యాలు కూడా పండించాలని ప్రకృతి వ్యవసాయ అదనపు జిల్లా ప్రాజెక్టు మేనేజర్ మహ బూబా వలీ అన్నారు. బుధవారం స్థానిక రైతు సేవా కేంద్రాన్ని సందర్శించారు. దీనిలో భాగంగా సిబ్బందితో కలిసి నవధాన్యాల కిట్‌ను తయారు చేసి రైతులకు పంపిణీ చేశారు. 13 కేజీలు ఉంటే రూ. వందకు అం దజేస్తున్నట్టు చెప్పారు. జూనియర్ ప్రాజెక్టు మేనేర్ వరలక్ష్మి మాట్లాడుతూ గతంతో పోలిస్తే రైతులు నవధాన్యాల సాగుపై ఆసక్తి చూపుతున్నారన్నారు. కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జి రామకృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని సైక్లిస్ట్‌కు గాయాలు

కొవ్వూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): లారీ ఢీకొని వ్యక్తి గాయపడినట్టు పట్టణ ఎస్ఐ కే. జగన్మోహనరావు తెలిపారు. పోలీసులు అందించిన వివరాల ప్రకారం .. పట్టణంలోని శ్రీరామకాలనీకి చెందిన మాసా మాణిక్యం ఈనెల 25వ తేదీన సైకిల్‌పై ఇంటి నుంచి ఆర్టీసీ బస్టాండ్ సెంటర్‌కు బయలుదేరాడు. ఈక్రమంలో మెరకవీధి వాటర్‌ట్యాంకు సెంటర్‌లో రాష్ట్ర రహదారిపై లారీ ఢీకొట్టింది. దీంతో మాణిక్యం సైకిల్ పైనుంచి కిందపడి గాయాలపాలయ్యాడు. చికిత్స నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అత్యవసర వైద్యం నిమిత్తం రాజమహేంద్రవరం రిఫర్ చేశారు. మాణిక్యం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ చెప్పారు.

వర్షపు నీటిని సంరక్షించాలి

» పర్యావరణవేత్త వెంకట యాదవ్
» 'నన్నయ'లో జాతీయ వర్క్‌షాప్


జ్యోతి ప్రజ్వలనతో సభను ప్రారంభిస్తున్న వీసీ ప్రసన్నశ్రీ

దివాన్‌చెరువు, మార్చి 26(ఆంధ్రజ్యోతి): అందరూ తమ ఇంటిపై పడిన వర్షపు నీటిని తామే సంరక్షించుకుంటే నీటి కోసం యుద్ధాలు అవసరం లేదని హైదరాబాద్‌కు చెందిన పర్యావరణవేత్త సిద్దనబోయిన వెంకట యాదవ్ అన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో నీటి సంరక్షణ, భవిష్యత్ సవాళ్లు అనే అంశంపై బుధవారం నిర్వహించిన జాతీయ వర్క్‌షాప్‌కు వీసీ ఎస్.ప్రసన్నశ్రీ, సిద్దనబోయిన ముఖ్య అతిథులుగా విచ్చేసి జ్యోతిప్రజ్వలనతో సభను ప్రారంభించారు. సిద్దనబోయిన మాట్లాడుతూ మన ఇంటి కింద 1.50 లక్షల లీటర్ల నీరు పట్టే సంపుతో ఇంటి నిర్మాణం చేపట్టాలని, ఇది నేటి కాలంలో చాలా ప్రాంతాల్లో ఆదర్శంగా నిలిచిందన్నారు. నన్నయ వర్శిటీని ప్రకృతి ఒడిగా తీర్చిదిద్దేందుకు సహకారం అందిస్తామన్నారు. వీసీ మాట్లాడుతూ సరిపడా నీరు తాగకపోతే శరీరంలో అవయవాలు పాడవుతాయన్నారు. యూనివర్శిటీలో నీటిఎద్దడి అధికంగా ఉందని, దాన్ని అధిగమించేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నామన్నారు. వెంకటయాదవ్ సహకారంతో పర్యావరణ అభివృద్ధి, నీటి సంరక్షణ కార్యక్రమాలు చేపడతామన్నారు. అనంతరం పర్యావరణం, నీటి సంరక్షణపై ప్రతిజ్ఞ చేయించారు. జల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీల్లోని విజేతలకు సర్టిఫికెట్లు అందజేశారు. రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, వర్శిటీ ఇంజనీర్ కె.నూకరత్నం, అధికార్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉద్రిక్తత... ఉత్కంఠ

● రాజమహేంద్రవరం ప్రభుత్వ బోధనాసుపత్రి వద్ద రోజంతా టెన్షన్ టెన్షన్
● భారీగా మోహరించిన పోలీసులు
● పోస్టుమార్టం అనంతరం సాయంత్రం 4.30 గంటలకు ప్రవీణ్ మృతదేహం హైదరాబాద్‌కు తరలింపు
● కేఏ పాల్ రాక, హైడ్రామా, మార్చురీ నుంచి మెయిన్‌గేటు వరకు రోడ్‌షో
● పరిస్థితిని సమీక్షించిన ఎస్పీ నరసింహ కిశోర్


ఆందోళన చేస్తున్న క్రైస్తవ సంఘాల నాయకులు, మాట్లాడుతున్న ఎస్పీ నరసింహకిశోర్

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ క్రైస్తవ సువార్తీకుడు ప్రవీణ్ పగడాల అనుమానాస్పద మృతి నేపథ్యంలో బుధవారం రాజమహేంద్రవరం ప్రభుత్వ బోధనాసుపత్రి వద్ద రోజంతా ఉద్రిక్తత, ఉత్కంఠ పరిస్థితులు నెలకొన్నాయి. తూర్పుగోదావరి జిల్లాకు చెందిన క్రైస్తవ సంఘాల నాయకులు, క్రైస్తవులు, ప్రవీణ్ ఫాలోవర్స్‌తో పాటు తెలంగాణ జిల్లాలు, ఖమ్మం ప్రాంతానికి చెందిన క్రైస్తవ ప్రముఖులు పెద్దసంఖ్యలో ఆసుపత్రికి చేరుకున్నారు. దీంతో పోలీసులు భారీగా మోహరించారు. ఆసుపత్రి ఆవరణలోని పోలీస్ అవుట్‌పోస్టు సమీపంలో క్రైస్తవ విశ్వాసులు పెద్దసంఖ్యలో మోకాలి ప్రార్థనలతో, నినాదాలతో ప్రవీణ్‌కు న్యాయం జరగాలని కోరుతూ ప్రార్థనలు చేశారు. అన్ని ఫార్మాలిటీస్ ముగిసిన అనంతరం సాయంత్రం 4.30 గంటల ప్రాంతంలో సువార్తీకులు ప్రవీణ్ పగడాల మృతదేహాన్ని ఒక ప్రైవేట్ అంబులెన్స్‌లో హైదరాబాద్ తరలించారు. జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్ ప్రభుత్వ బోధనాసుపత్రికి చేరుకుని శాంతిభద్రతలు, ఇతర అంశాలను పర్యవేక్షించారు. రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ కూడా ఆసుపత్రికి వచ్చి బాధిత క్రైస్తవ సంఘీయులకు న్యాయం జరిగేలా చూస్తామని ప్రకటించారు. ప్రవీణ్ పగడాల మృతి విషయాన్ని సీఎం చంద్రబాబు, మంత్రులు నారా లోకేశ్, హోంమంత్రి అనిత దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. ఈ విషయంలో సమగ్ర దర్యాప్తు చేయాల్సిందిగా సీఎం ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారని, మృతి కారణాలు సాధ్యమైనంత త్వరగా బయటకు వస్తాయన్నారు. కాగా ప్రభుత్వ బోధనాసుపత్రి ఆవరణలోని పోలీస్ అవుట్‌పోస్టులో ప్రవీణ్ మృతదేహానికి శవ పంచనామా జరిపారు. అనంతరం మార్చురీలో పోస్టుమార్టం పూర్తి చేశారు. ఈ ప్రక్రియ మొత్తం సాయంత్రం 4.30 గంటల వరకూ కొనసాగడంతో ఆసుపత్రి ఆవరణతోపాటు మెయిన్‌గేటు పరిసర ప్రాంతాల్లో ఉద్రిక్తత తలెత్తాయి.

మృత్యువుతో పోరాడి ఓడిన శిశువు

● ఏలూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి.. అందని సరైన వైద్యం



నల్లజర్ల,మార్చి26(ఆంధ్రజ్యోతి):పోతవరంలో అప్పుడే పుట్టిన శిశువును ముళ్లకంచెలో పడేసిన విషయం పాఠకులకు విదితమే. మంగళవారం ఈ విషాద ఘటన జరగ్గా.. మెరుగైన వైద్యం నిమిత్తం ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఉదయం 10 గంటలకు శిశువును ఆసుపత్రిలో చేర్పిస్తే మధ్యాహ్నం మూడు గంటల వరకు వైద్యసేవలు అందించడంలో వైద్యులు అలసత్వం వహించారు. అర్ధరాత్రి 12 గంటల వరకు కొనఊపిరితో ఆ చిన్నారి ప్రాణం కొట్టుమిట్టాడింది. చివరికి చికిత్స పొందుతూ తనవు చాలించింది. సకాలంలో వైద్యసేవలు అందించి ఉంటే శిశువు బతికే అవకాశం ఉండేదని, వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే మృత్యువాత పడినట్టు పలువురు విమర్శలు గుప్పిస్తున్నారు. ఏది ఏమైనప్పటికీ సకాలంలో స్పందించాల్సింది.

మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు


విద్యార్థులకు మజ్జిగ పంపిణీ చేస్తున్న టీచర్ నాగభూషణం

పెరవలి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పబ్లిక్ పరీక్షలు రాసే విద్యార్థుల కోసం మల్లేశ్వరంలో హిందీ పండిట్‌గా పనిచేస్తున్న ఎస్. నాగభూషణం బుధవారం మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభించారు.ఖండవల్లి, ముక్కామల పరీక్షా కేంద్రాల వద్ద వీటిని ఏర్పాటు చేశారు. మరో రెండురోజుల పాటు ద్రాక్ష, రస్నా డ్రింక్‌లను కూడా అందజేస్తామని ఆయన తెలిపారు.

కుటుంబ కలహాలతో ... కాలువలోకి దూకి ఒకరి ఆత్మహత్య

పెరవలి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : కుటుంబ కలహాలతో పెరవలిలోని కాలువలో దూకి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మంగళవారం జరగ్గా, బుధవారం అతని మృతదేహాన్ని పోలీసులు కనుక్కున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఖండవల్లి గ్రామానికి చెందిన చల్లా దుర్గారావు (29) అనే యువకుడికి భార్యతో విభేదాలు ఉన్నాయి. తరచూ గొడవలు పడుతుండటంతో తీవ్ర మనస్తాపం చెంది కాలువలో దూకేశాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

గోదావరిలో దూకి యువకుడి గల్లంతు

● రోడ్డు కం రైలు బ్రిడ్జిపై నిలిచిపోయిన ట్రాఫిక్


బ్రిడ్జిపై నిలిచిపోయిన వాహనాలు

కొవ్వూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు కం రైలు బ్రిడ్జిపై రాజమహేంద్రవరం వైపు యువకుడు గోదావరి నదిలో దూకి గల్లంతయ్యాడు. రాజానగరం గ్రామానికి చెందిన మునస వీరబాబు రాజమహేంద్రవరం లాలాచెరువు వద్ద మెకానిక్ షెడ్డులో పనిచేస్తున్నాడు. బుధవారం స్నేహితులతో కలిసి రంపచోడవరం వెళ్లి స్నేహితుడైన వెంకీతో కలిసి రోడ్డు కం రైలు బ్రిడ్జి దగ్గరకి వచ్చారు. రాజమహేంద్రవరం నుంచి వంతెన ఎక్కుతుండగా మోటారుసైకిల్ ఆపి, తన చేతిలో ఉన్న సెల్‌ఫోన్ స్నేహితుడికి ఇచ్చి ఒక్కసారిగా నదిలో దూకేశాడు. దీంతో వెంకీ కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. ఆత్మహత్యాయత్నానికి సంబంధించిన వివరాలు తెలియరాలేదు. దీంతో బ్రిడ్జిపై వాహన రాకపోకలు నిలిచిపోయాయి. సుమారు గంటన్నరపాటు ట్రాఫిక్ స్తంభించింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

ఇంజనీరింగ్ అసిస్టెంట్ల మాటలు బాధాకరం

కొవ్వూరు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను కించపరిచే విధంగా మాట్లాడడం కరెక్టు కాదని ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ రాష్ట్ర చైర్మన్ నక్కా వెంకటరత్నం అన్నారు. బుధవారం కొవ్వూరు గృహ నిర్మాణశాఖ డీఈ కార్యాలయం వద్ద ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు సమావేశాన్ని నిర్వహించారు. ఈ నెల 24వ తేదీన సచివాలయ ఇంజనీర్ అసిస్టెంట్స్ సచివాలయం ఎంప్లాయిస్ యూనియన్ తరఫున సమస్యలు తెలియపరిచే క్రమంలో హౌసింగ్ డిపార్టుమెంట్ మాకు ఒక శాపంలా ఉందనడం బాధాకరమన్నారు. పేద ప్రజలకు ఎంతో ప్రతిష్టాత్మకంగా హౌసింగ్ కార్పోరేషన్ ద్వారా ఇళ్లు నిర్మిస్తున్నటువంటి సంస్థను శాపంగా మారిందనడం సరైంది కాదన్నారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్స్ తమ సమస్యల పరిష్కారం కోసం పోరాడాలి తప్పా... ఔట్‌సోర్సింగ్, టెంపరరీ ఉద్యోగులను కించపర్చడం తగదన్నారు. సమావేశంలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు కె. నాగేశ్వరరావు, కేవీ సాయిరాం, వైఎస్ సోమశేఖర్, సీహెచ్ చంద్రశేఖర్, కె. ధర్మారావు, ఈ. వెంకన్నబాబు, బి. బాలకృష్ణ , తదితరులు పాల్గొన్నారు.